ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 30 జనవరి 2025 | 5

మాఘం.. సకల శుభాల మాసం
నేటి నుంచి శుభ ముహూర్తాల సందడి 6

ఈ ఏడాది ఆరంభంలోనే ఎన్నికల సందడి మొదలైంది. చాలాకాలం నుంచి పట్టభద్రులు ఎదురుచూస్తున్న ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది. ఇప్పటికే కార్యరంగం సిద్ధం చేసుకుని వివిధ వర్గాలతో అనేకమంది అభ్యర్థులు ఓటర్లతో మమేకం అవుతూ వస్తున్నారు. 2019లో జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థుల గడువు ముగియనుండడంతో తిరిగి ఎన్నిక అనివార్యమైంది. ఈసారి టీడీపీ సహా పెద్ద సంఖ్యలోనే అభ్యర్థులు రంగంలో నిలిచే అవకాశాలు ఉన్నాయి. ఆ మేరకు ఎన్నికల్లోను నువ్వానేనా అనేటట్టుగా అభ్యర్థులు ఢీకొనబోతున్నారు.

ఇక ఎమ్మెల్సీ పోరు!

మోగిన ఎన్నికల నగారా



- ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల
- ఈసారి రంగంలో టీడీపీ అభ్యర్థి
- ఇప్పటికే ప్రచార పర్వంలోకి
- వామపక్షాలతోపాటు బరిలోకి అత్యధికులు
- హోరాహోరీ పోటీ తప్పదా..




పేరాబత్తుల రాజశేఖర్... దిడ్ల వీరరాఘవులు

(కాకినాడ సిటీ/రాజమహేంద్రవరం / ఏలూరు-ఆంధ్రజ్యోతి)

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. దీంతో సమాంతరంగా ఎన్నికల 'కోడ్' కూసింది. ఇప్పటికే కూటమి తరఫున టీడీపీ సహా మిగతా పక్షాలు తమ అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపేందుకు సన్నాహాల్లో ఉన్నాయి. కూటమి టీడీపీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ను మూడు నెలల కిందటే రంగంలోకి దింపారు. ఓటర్ల నమోదు ప్రక్రియ ఆరంభం నుంచి రాజశేఖర్ తన పని తాను చేసుకుంటూపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ఎమ్మెల్సీల్లో ఎన్నికల్లో పార్టీ బలపరుస్తున్న అభ్యర్థి గెలిచేలా చూడాలని ఇప్పటికే టీడీపీ అధినాయకత్వం జిల్లాస్థాయి నాయకత్వాన్ని ఆదేశించింది. తాజాగా పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రాజశేఖర్ గెలుపు పార్టీకి అత్యవసరమని, ఎక్కడా పొరపాట్లకు, లోటు పాట్లకు తావివ్వద్దని పార్టీ ముఖ్యుల భేటీలో సీఎం చంద్రబాబు సూచనలు జారీ చేశారు. బుధవారం రాజశేఖర్ అమరావతిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి-మంత్రి నారా లోకేష్‌తో కూడా సమావేశమయ్యారు. ఇప్పటికే కూటమి ఎమ్మెల్యేలు, ఇతర నేతల మద్దతు ఆయనకు లభించింది. దీంతో పట్టభద్రుల ఓటర్ల నమోదు ఆరంభ దశలోనే ఆయనను ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటించేలా పార్టీ ముఖ్యులు చొరవ చూపారు. అన్ని నియోజకవర్గాల్లోను పట్టభద్రుల ఓటర్ల చేరికలో చొరవ తీసుకోవాల్సిందిగా ఉభయగోదావరి జిల్లాల నేతలకు అప్పట్లోనే ఆదేశాలు అందాయి. దీంతో పార్టీ సీనియర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరుండి మరీ రాజశేఖర్‌ను పార్టీ కేడర్‌కు పరిచయం చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆయన వివిధ నియోజకవర్గాల్లో ఓటర్లతో సాన్నిహిత్యం పెంచుకుంటూ వస్తున్నారు. ఇంకోవైపు గడిచిన 2019లో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా అప్పట్లో వామపక్షాలు బలపరిచిన అభ్యర్థి ఐ.వెంకటేశ్వరరావు గెలుపొందారు. విద్యావేత్త శేషారెడ్డిపై వెంకటేశ్వరరావు విజయం సాధించారు. ఆనాటి ఎన్నికల్లో వీరిద్దరి మధ్య హోరాహోరీగానే పోరు సాగింది. పట్టభద్రుల ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి రకరకాల ప్రయోగాలు చేశారు. వామపక్షాలు బలపరిచిన అభ్యర్థి కాకుండా తమకు మద్దతు ఇస్తే అనూహ్యంగా సరైన స్థితిగతులు కల్పిస్తామంటూ మిగతా వారంతా పెద్దఎత్తున ప్రచారం సాగించారు. అయినప్పటికీ పట్టభద్రుల ఓటర్లు వెంకటేశ్వరరావు వైపే మొగ్గు చూపారు. అప్పట్లో టీడీపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దిగకుండా జాగ్రత్తపడింది. ఈసారి వామపక్షాల మద్దతుతో తూర్పుగోదావరికి చెందిన దిడ్ల వీరరాఘవులు పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. తాము బలపరిచిన అభ్యర్థి గెలుపొందేలా, ఉమ్మడి నిర్ణయం అమలయ్యేలా వ్యూహం సిద్ధం చేసుకుంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలో లేని పక్షానికే ఓటర్ల మొగ్గు ఉంటుందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా తాము బలపరిచిన అభ్యర్థే గెలుపొందుతారన్న ధీమాతో ఉన్నారు. దీనికితోడు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున అభ్యర్థులు పోటీకి దిగే అవకాశాలు స్పష్టంగా కనపడుతున్నాయి. గతం కంటే భిన్నంగా ఈసారి పట్టభద్రుల్లో చైతన్యం రావడం, ఓటర్ల జాబితాలో సంతృప్తికర స్థాయిలో ఓటర్ల నమోదు జరగడం మరో పరిణామం. సాధ్యమైనంత మేర ఓటర్లను ఆకర్షించడం, గెలుపుకు చేరువకావడం అనే రెండు లక్ష్యాలను సాధించేందుకు తహతహలాడుతున్నారు. ప్రతిపక్ష వైసీపీ నుంచి పోటీ ఉంటుందా లేదా ఎవరికైనా మద్దతుగా నిలుస్తుందా.. స్పష్టత లేదు.

పురుష ఓటర్లదే ఆధిక్యత

గడిచిన మూడు మాసాలుగా ఓటర్ల జాబితాలో చేరికలు భారీగానే సాగాయి. నియోజకవర్గాల వారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కూటమి ముఖ్య నేతలు పట్టుపట్టి మరీ ఓటర్ల చేరికను ప్రోత్సహించారు. గడిచిన నెలన్నర కిందట ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్ల జాబితాలో కేవలం లక్షా 27 వేల మంది నమోదయ్యారు. ఆ తదుపరి నియోజకవర్గాల వారీగా సమీక్ష సాగడంతో ఒక్కసారిగా ఈ సంఖ్య ఎక్కడికక్కడ పెరుగుతూ వచ్చింది. మొత్తం ఓటర్ల సంఖ్య మూడు లక్షల 15 వేల 261గా ఉంది. వీరిలో పురుష ఓటర్ల సంఖ్య లక్షా 83 వేల 734 కాగా, అదే మహిళా ఓటర్ల సంఖ్య వీరికంటే తక్కువగా లక్షా 31 వేల 507గా లెక్క తేలింది. అంటే పట్టభద్రుల నియోజకవర్గంలో పురుష ఓటర్లే గెలుపోటములకు నిర్ణేతలు కాబోతున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 42 వేల 602 మంది ఓటర్లు ఉండగా అదే పశ్చిమగోదావరిలో 69 వేల 884 మంది ఉన్నారు. ఓటర్ల జాబితాలో పట్టభద్రులకు చోటు కల్పించే దిశగా ఏపీ ఎన్జీవోలు ఒకింత చొరవ చూపారు.

- నేటి నుంచి అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల
- 27న పోలింగ్.. మార్చి 3న కౌంటింగ్

కాకినాడ సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నిక నగరా మోగింది. ఏపీలో రెండు పట్టభద్రుల, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం షెడ్యూల్ విడుదలైంది. తూర్పు-పశ్చిమ గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. 10వతేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 11న నామినేషన్ల వడపోత చేయనున్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణ గడువుగా ప్రకటించారు. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ప్రక్రియ 8వ తేదీలోగా ముగించాల్సి ఉంది. ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఇంతవరకు ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 3 లక్షల15 వేల 261మంది పట్టభద్రుల ఓటర్ల నమోదు జరిగింది. ఇదిలా ఉండగా, ఈనెల 31వ తేదీ వరకు పట్టభద్రుల ఓటర్ల నమోదుకు గడువు ఉంది.

నామినేటెడ్ పోస్టులన్నీ వాయిదా

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బుధవారం నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీతో సహా మార్కెట్ కమిటీల ఎన్నిక ప్రక్రియ వరకు అంతా గప్‌చుప్‌గా అయింది. సంక్రాంతి పండుగ తర్వాత పదవుల పందేరం ఉంటుందని ఎంతో ఆశగా చూస్తున్న వారందరికీ ఈ ఎన్నికల షెడ్యూలు ఆశనిపాతంలా మారింది. ఇక మార్చి వరకు ఎదురుచూపులు తప్పవు.

సీఎం చంద్రబాబు పర్యటన రద్దు

రాజమహేంద్రవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఫిబ్రవరి 1న కొవ్వూరు మండలంలోని దొమ్మేరులో జరగవలసిన సీఎం నారా చంద్రబాబు నాయుడు పర్యటన రద్దు అయింది. పేదల గృహ ప్రవేశాలు ప్రారంభం, పించన్ల పంపిణీతోపాటు ఇక్కడ సభ నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎమ్మెల్యేలు ఈ మేరకు సమీక్షలు నిర్వహించారు. బుధవారం కూడా క్షేత్రస్థాయి సీఎం పర్యటనకు అవసరం ఏర్పాట్లన్నీ సుమారుగా సిద్ధం చేశారు. కానీ ఎలక్షన్ కమిషన్ పలు ప్రాంతాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం షెడ్యూల్ ప్రకటించి, తక్షణమే కోడ్ అమలులోకి వస్తున్నట్టు ప్రకటించింది. కానీ సీఎం ప్రోగ్రాం ముందుగానే నిర్ణయించింది కావడంతో అనుమతి ఇవ్వవలసిందిగా ఎన్నికల సంఘానికి ప్రభుత్వ యంత్రాంగం లేఖ కూడా రాసింది. కానీ కోడ్ అమలులోకి రావడం వల్ల సీఎం సభ నిర్వహణ వీలుకాదని, అది కోడ్ పరిధిలోకే వస్తుందని ఎన్నికల సంఘం స్పష్టం చేయడంతో ఇక్కడ పర్యటన వాయిదా పడింది. కాగా ఎన్నికలు లేని అన్నమయ్య జిల్లాకు సీఎం సభను మార్చారు.



రాజమహేంద్రవరంలో జరిగిన టీడీపీ నగర విస్తృత స్థాయి సమావేశలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి

పార్టీ జెండా మోసిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది

టీడీపీ నగర విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి29 (ఆంధ్రజ్యోతి): జెండా మోసి పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో బుధవారం జరిగిన నగర టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కార్యకర్తలు చాలా కష్టపడ్డారని అందరి కష్టం తమకు గుర్తుందన్నారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం రూ.8 లక్షల కోట్లు ప్రజాధనం దోపిడీచేసి ఇంటికి పోయాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమన్వయంగా ముందుకు సాగుతున్నామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఇప్పటికే నగరంలో జరిగిన ఆర్యాపురం, జాంపేట బ్యాంక్ ఎన్నికల్లోను, చాంబర్ ఎన్నికల్లోను టీడీపీలో కష్టపడిన వారికే ప్రాధాన్యత కల్పించామన్నారు. కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడు పెట్టిన టీడీపీ విజయం తథ్యమన్నారు. నగరంలో వైసీపీ ఖాళీ అయ్యిందని, తాము డోర్లు ఓపెన్‌చేస్తే ఆ పార్టీ పూర్తిగా ఖాళీ అవుతుందన్నారు. జగన్‌వల్ల అధోగతి పాలైన రాష్ట్రానికి చంద్రబాబు రూపంలో మనకు పెద్ద సంపద ఉందన్నారు. తొలుత మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ల ఆలోచనా విధానంలో రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు అంటేనే ఏపీ బ్రాండ్ ఇమేజ్ అని ప్రపంచవ్యాప్తంగా ఇమేజ్ ఉన్న నేత అని అన్నారు. దావోస్ పర్యటన ప్రభావం భవిష్యత్తులో చూస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే అంటే ఎలా పనిచేయాలో చూపిస్తున్న ఆదిరెడ్డి వాసుకు అభినందనలు తెలిపారు. శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌లు రాష్ట్ర ప్రగతి కోసం ఎలా కష్టపడుతున్నారో రాజమహేంద్రవరం అభివృద్ధికి ఆదిరెడ్డి వాసు అదే స్థాయిలో కష్టపడుతున్నారన్నారు. బ్యాంక్ ఛైర్మన్ చల్లా శంకర్రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, దొండపాటి సత్యంబాబు, వర్రే శ్రీనివాసరావు, కోసూరి చండీప్రియ, తురకల నిర్మల తదితరులు మాట్లాడారు.

పెద్దాసుపత్రిలో రోగుల సందర్శనకు ఆంక్షలు

జీటీజీహెచ్‌లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ మాత్రమే అనుమతి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పెద్దాసుపత్రిలో రోగులను పరామర్శించేందుకు వచ్చే సందర్శకులపై ఆసుపత్రి అధికారులు పలు ఆంక్షలు విధించారు. కేవలం సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్యలోనే రోగులను చూసేందుకు సందర్శకులను అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్) పర్యవేక్షణాధికారి పేరుతో ఆయా విభాగాధిపతులకు ఆదేశాలు ఇస్తూ, హెచ్‌వోడీలు అందరూ తమ కింద పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందికి ఈ విషయమై తగిన సూచనలు జారీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపిన విషయాల మేరకు ఈ చర్యలు తీసుకుంటున్నామని, ఈ సూచనలను తు.చ తప్పకుండా అందరూ పాటించాలని స్పష్టంచేశారు. దీంతో ఇన్‌పేషెంట్లుగా ఉన్న తమ వారిని పరామర్శించేందుకు వచ్చే సందర్శకులను. నిర్ణీత వేళల్లో మాత్రమే అనుమతిస్తారు. అలాగే ఆయా వార్డుల్లో వైద్యంకోసం చేరిన రోగులకు చెందిన వ్యక్తులు తప్ప ఇతర వ్యక్తులను అనుమతించరాదని, ఎటువంటి అనుమతిలేని తినుబండారాలను లోపలకు అనుమతించవద్దని సూచించారు. కాగా, గతంలో ఎన్నడూ లేని విధంగా హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపిన సూచనల మేరకు అంటూ, ఆసుపత్రి అధికారులు ఇలాంటి ఆదేశాలు జారీచేయడం వివాదాస్పదంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. రోగులను పరామర్శించడానికి సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య కేవలం రెండు గంటల సమయం కేటాయించడం, అది కూడా సాయంత్రం 4 తర్వాత మాత్రమే అని కండిషన్ పెట్టడం దూరప్రాంతాల నుంచి వచ్చేవారికి తీవ్ర ఇబ్బందికరంగా, భారంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికితోడు అనుమతిలేని తినుబండారాలను లోపలకు అనుమతించవద్దని సూచించడం గందరగోళానికి దారితీసే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అనుమతిలేని తినుబండారాలు అంటే ఏమిటనే దానిపై స్పష్టత లేకపోవడమే దీనికి కారణం. ఆసుపత్రిలో ప్రధానమైన సెక్యూరిటీ విభాగాన్ని పటిష్టం చేయకుండా ఇటువంటి అర్థంపర్థం లేని నిర్ణయాలు తీసుకోవడం ఏంటని, దీనివల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతుందని కొందరు మండిపడుతున్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంపై సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత బుధవారం రాజమహేంద్రవరంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అదనపు పబ్లిక్ ప్రాజిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశం నిర్వహించారు. మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టా ఆధునికీకరణకు రూ.19.37 కోట్లు నిధులు మంజూరు : నల్లమిల్లి 6

వాకింగ్‌కు వెళ్లి.. శవమై కనిపించి..! 7
పందలపాకలో వివాహిత అనుమానాస్పద మృతి

కదిలిన యంత్రాంగం

అక్షరం అండగా.. ఆంధ్రజ్యోతి
పరిష్కారమే అజెండాగా..

- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చా వేదికలోని సమస్యలపై దృష్టి
- ఇప్పటికే సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దిశానిర్దేశం
- సమస్యలను పరిశీలించిన కార్పొరేషన్ ఎస్ఈ, ఇంజనీరింగ్ అధికారులు
- పారిశుధ్యం, చెత్త డంపింగ్, డ్రైన్ క్లీనింగ్ సమస్యలపై తక్షణం రంగంలోకి
- 9వ డివిజన్‌లో శుభ్రమైన డ్రైన్లు, ఇంటింటి చెత్త సేకరణ వేగవంతం
- వెంకటేశ్వరనగర్ వ్యాలీ పోర్షన్‌లో 5వ నంబర్ రోడ్డు సమస్యపైనా చర్యలు
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'కు స్పందన ఇది




నగరంలోని 9వ డివిజన్ పరిధిలో వివిధ సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేషన్ అధికారులు



వెంకటేశ్వరనగర్‌లో చెత్త గుట్టలను తొలగిస్తున్న దృశ్యం



సిల్ట్ తొలగింపు పనులు

రాజమహేంద్రవరం/సిటీ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించడానికి అధికార యంత్రాంగం నడుంబిగించింది. మాస్టర్‌ప్లాన్ అమలుకాకపోవడంతో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం కాకపోవడం వల్ల ఇక్కడ ఓ ప్రముఖుని ఇంటి ముందే మురుగునీరు పేరుకుపోయి సమస్యగా మారింది. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి 'అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా' పేరుతో మంగళవారం రాజమహేంద్రవరం నగరపాలక పరిధిలోని 9వ డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్‌లో నిర్వహించిన చర్చా వేదికలో ప్రస్తావించిన సమస్యలపై కదలిక వచ్చింది. ప్రధానంగా నగర ప్రముఖుడు ఎ.మాధవవర్మ గత పదేళ్లుగా తమ డివిజన్‌లోని వ్యాలీ పోర్షన్ 5వ నెంబరు రహదారి, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కార్పొరేషన్ ఎస్ఈ పాండురంగారావుకు వివరించడంతో ఆ సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. ఈమేరకు బుధవారం ఉదయమే ఎస్ఈ పాండురావు, నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ కోటయ్య తమ సిబ్బందితో కలసి వచ్చి ఈ సమస్యను స్వయంగా పరిశీలించారు. పదేళ్లగా ఉన్న సమస్యను ప్లాన్‌లతో సహా మాధవవర్మ వారికి వివరించారు. దీనిపై ఎస్.ఈ పాండురంగారావు స్పందించి మొదట డ్రైన్ నిర్మాణం చేపడతామని, మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్డు నిర్మించడానికి ఇద్దరికి చెందిన ప్రైవేట్ స్థలాలను సేకరించి, వారికి టీడీఆర్ ఇవ్వవలసి ఉందన్నారు. దీనికి సంబంధించిన మ్యాప్‌లు, ప్లాన్‌లను సీపీ కోటయ్య తీసుకుని మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తామని చెప్పారు.

ఇది పదేళ్ల నాటి సమస్య


వెంకటేశ్వరనగర్‌లో వాకర్స్ పార్కు ఉన్న 5వ నెంబరు రోడ్డు సుమారు కిలోమీటరు ఉంటుంది. కానీ ఈ రోడ్డులో నివసించే ప్రజలకు పెద్ద సమస్య ఉంది. ఈ ప్రాంతం ఏవీ అప్పారావు రోడ్డుకు వెళ్లే వ్యాలీ పోర్షన్ (లోయ ప్రాంతం). దీంతో ఈ ప్రాంతంలో కురిసిన వాన, మురుగుతోపాటు ఎగువ భాగంలో ఉన్న 16 నంబర్ జాతీయ రహదారి ప్రాంతం నుంచి వచ్చే, మురుగు, వాన నీరంతా ఐదో నంబర్ రోడ్డు మీదకు వచ్చి అక్కడే ఉంటున్న ఎ.మాధవవర్మ ఇంటి ముందు ముంచేస్తుంటుంది. మరో రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఇంటికీ ఇదే సమస్య. వాస్తవానికి గతంలో మున్సిపల్ అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను అమలుచేసి ఉంటే ఈ సమస్య ఉండేది. ఈ రోడ్డు వాలుగా ఉంటుంది. జాతీయ రహదారిలో కురిసిన వాన నీరైనా, ఎగువ భాగంలోని మురుగు నీరైనా ఈ కిందకు రావలసిందే. తూర్పు, దక్షిణ, ఉత్తర భాగాలన్నీ ఎత్తులో ఉంటాయి. మరో మార్గంలోకి పార్కురోడ్డు డ్రైన్‌ను మళ్లించే అవకాశం లేదు. అందువల్ల ఈ రోడ్డులో రోడ్డు నిర్మించలేదు. డ్రెయిన్ కట్టలేదు. వాస్తవానికి మాధవవర్మ తన ఇంటిని నిర్మించుకునే ముందు రోడ్డు, డ్రైన్ నిర్మాణం కోసం తన సొంత స్థలం కొంత కార్పొరేషన్‌కు ఇచ్చి ఎల్ఆర్ఎస్ చేయించారు. ఆయన ఇంటి వెనుక ఉన్న మరో యజమాని కూడా మున్సిపాల్టీకి స్థలం రాసిచ్చారు. కానీ అధికారులు మాస్టర్ ప్లాన్‌ను అమలుచేయకపోవడం వల్ల ఆ వీధికి సమస్యగా మారింది.

డ్రైన్ సమస్య పరిష్కరిస్తాం : ఎస్ఈ

వెంకటేశ్వరనగర్‌లోని 5వ నంబర్ రోడ్డులో ముందుగా డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తామని నగరపాలక సంస్థ, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ పాండురంగారావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బుధవారం ఉదయం ఆయన సీపీ కోటయ్యతో కలసి ఈ ప్రాంతంలో పర్యటించారు. సమస్యను వెలుగులోకి తెచ్చిన మాధవవర్మ, రిటైర్డ్ ఇంజనీర్లు, ప్రభాకర్, సత్యనారాయణ అధికారులకు వివరించారు. ఇప్పటికే మున్సిపాల్టీకి స్థలం రాసివ్వడం వల్ల డ్రైన్ నిర్మాణానికి ఇబ్బందిలేదని త్వరగా ఈ డ్రైన్ నిర్మించి కింది రోడ్డులో నిర్మించిన స్టార్మ్ వాటర్ డ్రైన్‌లో కలుపుతామని చెప్పారు. రోడ్డు నిర్మాణం మాస్టర్ ప్లాన్ ప్రకారమే జరగవలసి ఉందని, ఇద్దరు యజమానులకు చెందిన ప్రైవేట్ స్థలంలో కొంతస్థలం తీసుకోవలసి ఉందని, వారికి టీడీఆర్‌లు ఇచ్చే యోచన చేసి, ఇక్కడ మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తామని సీపీ కోటయ్య, ఎస్ఈ పాండురంగారావు తెలిపారు.

9వ డివిజన్‌లో... 12 గంటల్లో...

అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా పేరుతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మంగళవారం నిర్వహించిన చర్చా వేదికలో ప్రస్తావించిన సమస్యలపై అధికార యంత్రాంగం చర్యలకు దిగింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ డివిజన్ సమస్యలపై స్పందించి భరోసా ఇచ్చినవిధంగానే అధికారులు 12గంటలు తిరగకుండా యాక్షన్‌లోకి వెళ్లారు. బుధవారం ఉదయం 8 గంటలకే నగరపాలక సంస్థ ఎస్ఈ ఐ.పాండురంగారావు, ఈఈ, డీఈలతో వెంకటేశ్వనగర్‌లో పర్యటించారు. ఈ బృందంతోపాటు నగర ప్రముఖులు ఎ.మాధవవర్మ, పార్కు అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ, రిటైర్డ్ ప్రభుత్వాధికారి ఎ.వెంకటేశ్వరరావులు ఆ డివిజన్‌లో రహదారులు, పార్కులోని సమస్యలు, డ్రైన్‌లను చూపించారు. వాకర్స్ పార్కు సొసైటీ నిర్వహణలో ఉంది. అందులో ఉన్న చిన్నచిన్న సమస్యలపై కూడా చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇక బర్మాకాలనీ, విద్యుత్ కాలనీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, డ్రైనేజీలో సిల్ట్ తొలగింపు, ఇంటింటి చెత్త సేకరణ చేపట్టారు. ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న ఆదేశాలతో ఎస్ఎస్ రామలింగారెడ్డి పర్యవేక్షణలో ఆయా పనులు జరుగుతున్నాయి. చర్చా వేదికలో ప్రస్తావించిన అంశాలపై పరిశీలనకు వచ్చిన అధికారులతోపాటు మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ ఉన్నారు.



బంగారు పాప ఆలయం, ఆమె రూపం (ఇక్కడే కోరికలు మొక్కుకుంటారు) (కింద)

హిందూ, ముస్లింల ఆరాధ్య దైవం

బంగారు పాప



పొన్నాడలో వచ్చే నెల 7 నుంచి ఉరుస్ ఉత్సవాలకు ముజావర్ల ఏర్పాట్లు

కొత్తపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడలో బషీర్‌బీబీ ఔలియా (బంగారు పాప) హిందూ, ముస్లింల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటోంది. మహా శక్తి సంపన్నురాలు, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన బంగారు పాపను దేశం నలుమూలల నుంచి అనేక మంది విచ్చేసి మొక్కులు చెల్లించుకుంటారు. బంగారు పాపను ఒకసారి దర్శించుకున్న తర్వాత సంతానం లేని దంపతులకు సంతానం, వివాహం కాని యువతీ, యువకులకు వివాహం జరుగుతుందని ప్రతీతి. దీంతో ప్రతి సంవత్సరం మాఘ మాసంలో మూడు రోజుల పాటు జరిగే బంగారు పాప ఉరుస్ ఉత్సవాలకు భక్తులు పోటెత్తుతారు. బంగారు పాప మహాసంపన్నురాలు కావడంతో పొన్నాడ గ్రామంలో పేదరికంలో ఉండి నీతి, నిజాయితీ కలిగిన కుటుంబాల్లో వివాహ వేడుకలకు బంగారు ఆభరణాలను సమకూర్చేదని, వివాహం అనంతరం తిరిగి బంగారు పాపకు ఇచ్చేవారని ముస్లిం పెద్దలు చెప్తున్నారు. పిఠాపురం పట్టణానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొన్నాడ గ్రామంలో ఎప్పుడో బంగారు పాపకు నిర్మించిన ఏడు అంతస్తుల భవనంలో 6 అంతస్తులు భూమిలో దిగబడి ఉండడం గమనార్హం. కింద అంతస్తులో బంగారుపాపగా భావించే పచ్చరంగు కర్టెన్లకు భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లిస్తారు. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి పొన్నాడలో జరిగే ఉరుస్ ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు భోజన, వసతి సౌకర్యాలను సమకూర్చడంలో స్థానిక ముజావర్లు నిమగ్నమయ్యారు.



మాఘం... సకల శుభాల మాసం



- నేటి నుంచి పెళ్లిళ్లు, గృహ ప్రవేశాల సందడి
- ఒక్క మాఘ మాసంలోనే సత్యదేవుని సన్నిధిలో సుమారు 600, ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5వేల వివాహాలు జరగొచ్చని అంచనా



అన్నవరం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పెళ్లిళ్లు, గృహప్రవేశాలు తదితర శుభ కార్యక్రమాలకు ముందుగా గుర్తొచ్చేది మాఘ మాసమే. ఎందుకంటే ఉత్తరాయన పుణ్యకాలం ప్రారంభమైన తర్వాత తరువాత మొదటగా వచ్చే శుభం కలిగే మాసంగా దీనిని పండితులు పరిగణిస్తుంటారు. ఉత్తరాయనం పుష్య మాసంలో వచ్చినా అది శూన్యమాసం కావడంతో శుభ కార్యక్రమాలు చేపట్టరు. గురువారం నుంచి మాఘ మాసం ప్రారంభమవుతుండగా వివాహాది శుభ కార్యక్రమాలు మొదటి రోజు నుంచే ప్రారంభం కానున్నాయి. 30న ప్రారంభమయ్యే పెళ్లిళ్ల సందళ్లు వైశాఖ మాసం వరకు కొనసాగనున్నాయి. అయితే ఒక్క మాఘ మాసంలోనే సత్యదేవుడి సన్నిధిలో సుమారు 600 వరకు వివాహాలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే చాలా పెళ్లి బృందాలు వివాహ వేదికలను బుక్ చేసుకోగా మరికొందరు ఎటువంటి అడ్వాన్సు చెల్లించకుండా అమావాస్య ముగిసిన తర్వాత చెల్లించేలా ఒప్పందాలు చేసుకున్నారు. మాఘమాసంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5వేల పెళ్లిళ్లు జరగొచ్చని అంచనా వేస్తున్నారు. జనవరి 30, 31తో పాటు ఫిబ్రవరి నెలలో 2, 3, 7, 13, 14, 15, 18, 19, 20, 21, 23, 25 తేదీల్లో వివాహ ముహూర్తాలున్నాయి. 7, 15, 18, 20, 22 తేదీల్లో ముహూర్తాలు మరింత బలమైనవని పండితులు చెప్తున్నారు. మార్చి నెలలో 8 రోజులు, ఏప్రిల్ నెలలో 12 రోజులు, మే నెలలో 10 రోజులు వివాహాలు, గృహప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయన ముహూర్తాలున్నాయని పంచాంగకర్తలు పేర్కొన్నారు. వరుస శుభ కార్యక్రమాలతో పురోహితులు, సన్నాయిమేళం, క్యాటరింగ్, డెకరేషన్ మండపాలకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. వీరు ధరలను అమాంతం పెంచేస్తూ వివాహ బృందాల నడ్డివిరిచేస్తున్నారు.



మెండుగా

శుభ ముహూర్తాలు

కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి



అమలాపురం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మాఘ మాసం ఎప్పుడు వస్తుందోనని నవ వధూవరులు ఎదురు చూస్తుంటారు. ఆ మాసం రానే వచ్చింది. వివాహాది శుభ ముహూర్తాలు మాఘ మాసంలో మెండుగా ఉన్నాయని బండారులంకకు చెందిన ఈశ్వర పంచాంగకర్త కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి తెలిపారు.

వివాహం: ఈ నెల 31, ఫిబ్రవరి 2, 8, 12, 15, 16, 18, 20, 22, 23

శంకుస్థాపన: ఫిబ్రవరి 3, 8, 10, 15, 16, 17, 18, 20.

గృహప్రవేశం: ఈ నెల 31, ఫిబ్రవరి 2, 8, 10, 15, 16, 17, 20

మాఘ మాసంలో ముఖ్య పండుగలు..

ఫిబ్రవరి 2న శ్రీపంచమి, 4న తేదీ రథసప్తమి, 5న భీష్మాష్టమి, 8న భీష్మ ఏకాదశి, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి తీర్థం, 12న మహామాఘి కుంభ సంక్రమణం, 16న సంకష్టహర చతుర్థి, 26న మహాశివరాత్రి, 27న ముమ్మిడివరం బాలయోగీశ్వరుల తీర్థం.

ఫాల్గుణ మాసంలో..

ఫిబ్రవరి 28 నుంచి మార్చి 29 వరకు

వివాహం: మార్చి 1, 2, 6, 7, 12, 14, 15.

శంకుస్థాపన: మార్చి 1, 2, 3, 6, 7, 9, 14, 15

గృహప్రవేశం: మార్చి 1, 2, 6, 7, 9, 14

ముఖ్య పండుగలు..

మార్చి 10న కోరుకొండ తీర్థం, 13న హోళీ, 15న వసంతోత్సవం, 16 నుంచి 29వ తేదీ వరకు శుక్ర మౌఢ్యమి, 30న ఉగాది.





మీర్ జవాద్ అలీ కెమెరాతో తీసిన ప్రకృతి సోయగం చిత్రం

ప్రకృతి (చిత్ర) సోయగం

మామిడికుదురు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ వర్క్‌షాప్ జరిగింది. పంట కాల్వలో పసుపు రంగు తెరచాపతో ఉన్న పడవలో మత్స్యకారుడు వల విసురుతున్న దృశ్యాన్ని మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మీర్ జవాద్ అలీ అలీ తన కెమెరాలో బంధించాడు. ఈ చిత్రానికి జాతీయ స్థాయిలో రజత పతకం లభించింది.

సత్యదేవుని సన్నిధిలో ఎస్పీఎఫ్ ఐజీ



ఎస్పీఎఫ్ ఐజీ రామిరెడ్డికి సత్యదేవుని మెమెంటో అందజేస్తున్న పీఆర్వో కృష్ణారావు

అన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధికి బుధవారం స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డి విచ్చేశారు. ఆయనకు పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం ఐజీకి వేదపండితులు వేదాశీర్వచనాలు ఇవ్వగా పీఆర్వో స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ భద్రతకు సంబంధించి దేవస్థానం ఎస్పీఎఫ్ సిబ్బందికి ఐజీ పలు సూచనలు చేశారు.

నేడు సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కిస్తామని ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బంది హాజరు కావాలన్నారు.



కరప మండలం ఉప్పలంకలో తీర్థంలో భాగంగా గరగలు, వీరభద్రుడి ఊరేగింపు



భక్తులతో కిక్కిరిసిపోయిన యానాం జాతీయరహదారి

భక్త 'జనసంద్రం'

- చొల్లంగి తీర్థానికి పోటెత్తిన భక్తులు
- జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది రాక
- సముద్ర స్నానాలాచరించి స్వామివారి దర్శనం
- ఏర్పాట్లు చేసిన కమిటీలు

కరప, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రాశస్త్యం కలిగిన చొల్లంగి అమావాస్య తీర్థానికి భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు కరపమండలం ఉప్పలంక శివారు మొండి గ్రామం విచ్చేసి సముద్ర తీరాన కొలువుదీరిన బాలత్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి విచ్చేసి సముద్ర స్నానాలాచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. చొల్లంగిలోని రాజరాజేశ్వరిదేవి సమేత సోమేశ్వరస్వామి, కాలభైరవస్వామి, సీతారామాంజనేయ స్వామివార్లను కూడా దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కరప, తాళ్లరేవు, కాజులూరు, తదితర మండలాల నుంచి వీరభద్రుని ప్రభలు, గరగలను భారీ ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అలాగే అప్పన్నెద్దులను కోలసంబరం పాటలు, నృత్యాలతో తోలుకువచ్చి సముద్ర స్నానాలు చేయించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, దేవాదాయశాఖ సిబ్బంది స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లను, వైద్యసేవల కోసం శిబిరాన్ని, తాగునీటి వసతి, అన్నదానం ఏర్పాటుచేశారు. మధ్యాహ్నం నుంచి అప్పనెద్దులకు ప్రవేశం కల్పించగా వాటికి సముద్ర స్నానాలు చేయించి స్వామివారి దర్శించుకున్నారు. సంగమ ప్రదేశం వద్ద జంగమ దేవరులు పలువురిచే పిండ ప్రదానం చేయించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన శివపార్వతులకల్యాణం, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తులు ఆసక్తితో తిలకించారు. కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప, పెదపూడి, ఇంద్రపాలెం, గొల్లపాలెం, కాకినాడ పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తుల రద్దీతో యానాం జాతీయరహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల రాకపోకలను మళ్లించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ మల్లాడి కార్తీక్‌నాయకర్, ఎమ్మెల్యే పంతం నానాజీ తనయుడు సందీప్, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఎంఎస్ఎన్ చార్టీస్ ఈవో కె.విజయలక్ష్మి, ఇతర ఈవోలు మోర్తా మురళీ వీరభద్రరావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు, సర్పంచ్ బొమ్మిడి నయోమి సతీష్, ఈవోపీఆర్డీ సలాది శ్రీనివాసరావు, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



కరప మండలంలో విశేషాలంకరణలో బాల త్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామి



పిండ ప్రదానాలు జరుపుతున్న జంగమ దేవరులు

బ్రహ్మ సమేధ్యంలో...

కాట్రేనికోన, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం సమీపంలోని బ్రహ్మసమేధ్యంలో చొల్లంగి అమావాస్య వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. బ్రహ్మదేవుడు లింగ రూపంలో, కాలభైరవుడు క్షేత్రపాలకుడుగా ఉన్న ఈ పుణ్యక్షేత్రం అత్యంత మహిమాన్వితమైనదిగా భక్తుల నమ్మకం. సంతానార్థులైన మహిళలు రాత్రి సమయంలో గుడి ఆవరణలో నిద్రించి, సంతానం ప్రాప్తికి పూజలు చేశారు. రాత్రి జాగారం తర్వాత భక్తులు సముద్ర స్నానమాచరించి, బ్రహ్మదేవుని దర్శించుకున్నారు. తమ కోర్కెలు నెరవేరిన భక్తులు ఇక్కడ కొబ్బరి మొక్కలు నాటారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల కోసం కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పల్లం శ్రీకాలభైరవస్వామి అన్నసమారాధన కమిటీ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగిడి నాగేశ్వరరావు, దాట్ల పవన్, దాట్ల పృధ్వి, చెల్లి అశోక్, దండుప్రోలు సత్యం, బొమ్మిడి లింగేశ్వరరావు, దండుప్రోలు బాలయ్య, మల్లాడి అన్నవరం, అంగాని నరసింహమూర్తి, తదితరులు పూజల్లో పాల్గొన్నారు.



తీర్థంలో గంగిరెద్దుల కోలాహలం



కాట్రేనికోన బ్రహ్మదేవుని ఆలయ ఆవరణలో నిద్రిస్తున్న మహిళలు

వేటూరి పురస్కారం....

నా పూర్వజన్మ సుకృతం

- ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ
- తుని చిట్టూరి మెట్రోలో అట్టహాసంగా వేటూరి సాహితీ పురస్కార వేడుక
- భారీగా హాజరైన వేటూరి సాహితీ అభిమానులు, ప్రజలు



తునిలో సినీ గేయ రచయిత అశోక్ తేజకు వేటూరి పురస్కారం అందజేసి సత్కరిస్తున్న నిర్వాహకులు

తుని రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు నేలపై వేటూరి సాహితీ పురస్కారం పొందడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ తెలిపారు. వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా ఏటా నిర్వహించే వేటూరి సాహితీ పురస్కార వేడుక తుని చిట్టూరి మెట్రోలో కన్నుల పండుగగా జరిగింది. 14 ఏళ్లుగా నిర్విరామంగా జరుగుతున్న ఈ వేడుకలో పలువురు రచయితలను నిర్వాహకులు ఘనంగా సత్కరిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది సినీ గేయ రచయిల సుద్దాల అశోక్ తేజను ఎంపిక చేసి కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ప్రముఖులు, వేటూరి సాహితీ అభిమానుల మధ్య నిర్వాహకులు సుద్దాల అశోక్‌తేజకు వేటూరి పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గేయ రచయిత సుద్దాల అశోక్ మాట్లాడుతూ వేటూరి వంటి మహనీయులు జయంతి వేడుకను తునిలో ఇంత వైభవంగా నిర్వహించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, ఇది సాహిత్యానికి ఇస్తున్న గౌరవంగా ఆయన అభివర్ణించారు. వేటూరి వంటి మహనీయులను అభిమానించడం అంటే అక్షరాలను పూజించడం ఆరాధించడం అన్నారు. కవులు ఉన్నంత కాలం తెలుగు భాష వైభవం తగ్గదని 1994లో సినీ రంగంలోకి ప్రవేశించానని, ఎన్నో పాటలు ప్రయోగాలతో నేటికీ 3000 పైబడి పాటలు రచించానన్నారు. తన తండ్రిలో ఉన్న విప్లవ పదజాలం ఆత్రేయ గారి సరళి వలనే తన పాటలకు ప్రత్యేకమైన గుర్తింపుని, వేటూరి వంటి మహనీయులు తమకు స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం సినీ దర్శకుడు శేఖర్ కమ్ములతో కలిసి సాహితీ అభిమానులు 150 పుస్తకాలతో సుద్దాల అశోక్‌తేజను ఘనంగా సత్కరించారు. దర్శకుడు శేఖర్ కమ్ముల మాట్లాడుతూ సుద్దాల అశోక్‌తేజ ఈ పురస్కారానికి అర్హులని, ఈ వేడుకలో పాలుపంచుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. పిల్లలు వేటూరి పాటలు వింటే సాహిత్యంపై అవగాహన పెరుగుతుందన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ వేటూరి సాహితీ పీఠం ద్వారా ప్రతిఏటా పురస్కారాలు ప్రదానం చేయడం వేటూరికి తాము ఇచ్చే నివాళిగా భావిస్తున్నామన్నారు. వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు చక్కా సూర్యనారాయణ, వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మతో పాటు తుని, పాయకరావుపేటకు చెందిన పలువురు ప్రముఖులు, వేటూరి అభిమానులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టా ఆధునికీకరణకు రూ.19.37 కోట్లు

- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టా ఆధునికీకరణకు రాష్ట్రప్రభుత్వం రూ. 19.37 కోట్ల నిధులు మంజూరు చేసిందని తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన అనపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నిధులతో గోదావరి డెల్టాలో 122 పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన రెండో అసెంబ్లీ సమావేశాన్ని గోదావరి డెల్టా ఆధునికీకరణపై తాను లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం స్పందించిందన్నారు. ఈ నిధులతో గోదావరి డెల్టాలో పంట కాలువలు, మురుగునీటి కాలువలను శుభ్రం చేస్తారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి వ్యవస్థను కూటమి ప్రభుత్వం మళ్లీ గాడిలోకి తేస్తుండడంతో రైతులకు ఊరట కలగనుందన్నారు.

ప్రేమ పేరుతో మోసగించి.. వ్యభిచార వృత్తిలోకి దింపి..

- పెద్దాపురంలో బాలికకు నరకం చూపించిన తల్లీకొడుకు
- అచేతన స్థితికి చేరుకున్న బాధితురాలు
- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు

పెద్దాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఓ మైనర్ బాలికకు ప్రేమ పేరుతో వల వేసి ఆపై పెళ్లి పేరుతో మోసగించి వ్యభిచార వృత్తిలోకి దింపి నరకం చూపించారు ఓ తల్లికొడుకు. దీంతో బాలిక అచేతన స్థితికి వెళ్లింది. ఈ ఘటన కాకినాడ జిల్లా పెద్దాపురంలో వెలుగుచూసింది. నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

అసలేం జరిగిందంటే..

స్థానిక ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన చందు అనే యువకుడు అనకాపల్లి జిల్లాకు చెందిన ఓ 17 ఏళ్ల మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి ఆపై పెళ్లి పేరుతో వంచించి పెద్దాపురం తీసుకు వచ్చాడు. కొన్నిరోజులు గడిచాక తల్లీ నీలిమ, కొడుకు చందూ డబ్బుపై ఆశతో బాలికకు తమ విశ్వరూపాన్ని చూపించారు. వ్యభిచారం చేయాలంటూ వేధించడం ప్రారంభించి నిత్యం బాలికకు నరకం చూపించారు. బలవంతంగా బాలికతో వ్యభిచారం చేయించారు. దీంతో బాలిక అనారోగ్యం పాలయ్యింది. అలాగే కొన్ని రోజులకు ఆమె శరీరంలో ఇన్‌ఫెక్షన్ రావడంతో స్థానికంగా ఉన్న ఆర్ఎంపీతో చికిత్స చేయించారు. బాలికకు రకరకాల మందులను వాడించి నానాహింసలకు గురి చేశారు. తల్లీ కొడుకులు పెట్టే బాధలు తాళ లేక గతేడాది డిసెంబరు 28న చీమల మందు తాగి బాలిక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పరిస్థితి విషమించడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అప్పటికే బాలికకు చేతులు, కాళ్లు వంకర్లు పోయి కదలేక అచేతనంగా ఉండిపోయింది. కాకినాడ చేరుకున్న బాలిక తల్లి దండ్రులు విశాఖ విమ్స్‌కు తీసుకు వెళ్లి చికిత్స అందించారు. బాలిక మానసిక స్థితి కూడా తేడా రావడంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితులైన తల్లీకొడుకుపై కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలిసిన నిందితులు పరారీ కావడంతో పోలీసులు ముమ్మంగా గాలించి అరెస్ట్ చేశారు.

పోక్సో కేసు నమోదు

మైనర్ బాలికతో నిర్బంధ వ్యభిచారం చేయించిన కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు వెల్లడించారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సుమారు 6 నెలల క్రితం బాధిత మైనర్ బాలికకు పెద్దాపురానికి చెందిన ధరణికోట చందు అనే యువకుడితో ప్రేమ వివాహం జరిగిందన్నారు. బాలికను ఆమె అత్తగారు వ్యభిచారం చేయమని ప్రోత్సహించినట్టు, డ్రగ్స్ ఇచ్చి ఇబ్బంది పెట్టినట్టు పోలీసులకు తెలియచేయలేదన్నారు. ఈనెల 25న పెద్దాపురం పోలీస్ స్టేషన్‌కు వైజాగ్ విమ్స్ ఆసుపత్రి నుంచి వచ్చిన బాధిత బాలిక తల్లి వచ్చి ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై ఈనెల 26న కేసు నమోదు చేసినట్టు తెలిపారు. అలాగే నిందితుడు చందుపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం కేసు దర్యాప్తులో ఉందని, మరింత లోతుగా దర్యాప్తు చేస్తామన్నారు. ఈ కేసు విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని తెలిపారు. సమావేశంలో సీఐ ఏ.కృష్ణ భగవాన్, ఎస్ఐ మౌనిక పాల్గొన్నారు.

పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక పాలసీ

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- కాకినాడలో ఏపీ హోటల్స్ అసోసియేషన్ సమావేశం


కాకినాడలో లోగో ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రత్యేక పాలసీని తీసుకొచ్చి అమలు చేయనున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కాకినాడలో స్థానిక వెంకీ రెసిడెన్సీ హోటల్‌లో బుధవారం రాత్రి ఏపీ హోటల్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. 26 జిల్లాల నుంచి పలు హోటళ్ల యజమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టూరిజం శాఖకు ఇండస్ట్రీ హోదా ఇస్తున్నామన్నారు. పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ ఇస్తామని హామీ ఇచ్చారు. హోటల్ ఇండస్ట్రీస్ పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. టూరిజం అభివృద్ధి చెందాలంటే హోటల్ ఇండస్ట్రీని ముందుకు తీసుకువెళ్లాలని, ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం పరిష్కారం చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ఆలోచనతో టూరిజం అభివృద్ధికి సానుకూల దృక్పథంతో ఉన్నారన్నారు. ఏపీలో సింగిల్ విండో విధానంలో టూరిజం అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ప్రత్యేకమైన టూరిజం పాలసీ ద్వారా రిసార్ట్స్, హోటల్స్, ఇతర నిర్మాణాలు, వివిధ విభాగాలను అభివృద్ధి చేస్తామన్నారు. టెంపుల్ టూరిజం కూడా అభివృద్ధి చేస్తామన్నారు. పర్యాటకుల సందర్శనలో వారికి సౌకర్యాలు కల్పించడంలో హోటళ్ల పాత్ర చాలా కీలకంగా ఉందని మంత్రి తెలిపారు.

హోటళ్లకు విద్యుత్ రాయితీలు

పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ మాట్లాడుతూ టూరిజాన్ని ఒక పరిశ్రమగా తీసుకుని వస్తున్నామని, హోటళ్లకు విద్యుత్ రాయితీలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే హోటళ్లకు రాయితీలు ఇచ్చేలా టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మంచి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని సక్రమంగా వినియోగించుకుంటే ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందన్నారు. టూరిజం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసి అమలు చేయనుందన్నారు. పర్యాటక ప్రదేశాల్లో సౌకర్యాల మెరుగుదలకు కృషి చేస్తామన్నారు. హోటళ్లలో సౌకర్యాలు మెరుగుపడితే పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్వీ స్వామి మాట్లాడుతూ టూరిజంశాఖ ద్వారా హోటళ్ల నిర్వహణకు అవసరమైన తోడ్పాటును అందజేయాలని మంత్రిని కోరారు. టూరిజం డెవలప్మెంట్ కమిటీలో హోటల్ మేనేజ్మెంట్‌ను కూడా చేర్చాలని, లైసెన్స్ ఫీజులను రద్దు చేయాలని కోరారు.

కౌడా నుంచి పూర్తి సహకారం

కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ టూరిజంపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టితో ఉన్నారన్నారు. రాష్ట్ర పర్యాటక రంగాన్ని, హోటల్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. కౌడా నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. హోటల్ మెనేజ్మెంట్ రంగానికి సహకారం అందిస్తామన్నారు. ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్(టీడీసీ) చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఏపీలో టూరిజం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తోందన్నారు. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు, సంపద సృష్టికి టూరిజం పాలసీని కూడా తీసుకొచ్చారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంకీ రెసిడెన్సీ ఎండీ మూర్తి, హోటళ్ల యజమానుల అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

సముద్ర స్నానం చేస్తూ వ్యక్తి మృతి


మృతిచెందిన వెంకటసుబ్బారావు

అల్లవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చొల్లంగి అమావాస్య సందర్భంగా సముద్ర జలాల్లో పుణ్యస్నానాలు చేస్తూ వ్యక్తి మృతి చెందిన సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు ఎస్.రామేశ్వరంలో బుధవారం ఉదయం జరిగింది. అయినవిల్లి మండలం నల్లచెరువు గ్రామానికి చెందిన బొడ్డు వెంకటసుబ్బారావు (45) ఎస్.రామేశ్వరంలో సముద్ర స్నానానికి దిగి పెద్ద అలకు కొట్టుకుపోయి మృతిచెందాడు. అన్నను రక్షించే ప్రయత్నంలో బొడ్డు రమేష్ సముద్రంలో మునిగిపోతుండగా స్థానికులు దిగి రమేష్‌ను ఒడ్డుకు చేర్చారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు రామేశ్వరం వచ్చిన అన్నదమ్ములిద్దరూ 8 గంటల ప్రాంతంలో ఎవరూలేని చోట స్నానానికి దిగగా పెద్ద కెరటానికి కొట్టుకుపోయి అన్న వెంకటసుబ్బారావు మృతిచెందగా తమ్ముడు రమేష్‌ను స్థానికులు రక్షించారని పోలీసులు తెలిపారు. వెంకటసుబ్బారావు నేదునూరులో పాన్‌షాపు నడుపుతున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్‌లు ప్రమాద స్థలిని సందర్శించారు. వెంకట సుబ్బారావు మృతదేహానికి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి కాకినాడ ఐటీఐలో బ్రిడ్జి కోర్సు ప్రారంభం

కన్వీనర్ వేణుగోపాల వర్మ

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో రెండేళ్ల కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాలిటెక్నిక్ డిప్లమోలో నేరుగా రెండో సంవత్సరంలో చేరేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్షకు సిద్ధం చేయడానికి బ్రిడ్జి కోర్స్ తరగతులు నిర్వహిస్తున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ జిల్లా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల జిల్లాల కన్వీనర్ ఎం వేణుగోపాల వర్మ తెలిపారు. ఈ నెల 30 నుంచి ఈ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ పదవ తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులైన ధృవీకరణ పత్రాల జెరాక్స్ కాపీలను తీసుకుని నేరుగా కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో సంప్రదించాలన్నారు. ఏమైనా సందేహాలుంటే 87907 98431, 94946 88516లలో సంప్రదించాలన్నారు.

వాకింగ్‌కు వెళ్లి.. శవమై కనిపించి..!

పందలపాకలో వివాహిత అనుమానాస్పద మృతి


లలితేశ్వరి మృతదేహం

బిక్కవోలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాకలో ఓ వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. కురుపూడి లలితేశ్వరి (33) స్థానిక సంచుల గొడౌన్లో గుమస్తాగా పనిచేస్తోంది. రోజువారీ దినచర్యలో భాగంగా బుధవారం తెల్లవారుజామున వాకింగ్‌కు బయటకు వెళ్లింది. అయితే ఎంతసేపైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త రాజు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బంధువులకు సమాచారమిచ్చాడు. వారంతా వచ్చి వెతకగా ఆమె పనిచేస్తున్న సంచుల గొడౌన్లో శవమై కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ముఖంపై గాయాలు, రక్తపు మరకలు ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు బిక్కవోలు ఎస్ఐ వీ.రవిచంద్ర కుమార్ తెలిపారు. క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించింది. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించ గా, అవి సంఘటనా స్థలం నుంచి గ్రామంలోని జెండా పంజా సెంటర్ వరకు వచ్చి ఆగిపోయాయి. ఈస్ట్‌జోన్ డీఎస్పీ బీ.విద్య, అనపర్తి సీఐ సుమంత్ వచ్చి పరిశీలించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

5 నుంచి తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు

గొల్లప్రోలు రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై మార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఉభయ తెలుగురాష్ట్రాల నాటికల పోటీలు జరగనున్నాయి. 9వ తేదీ వరకూ జరిగే నాటికల పోటీలకు ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి వివిధ నాటక సమాజాల కళాకారులు వచ్చి నాటికలు ప్రదర్శిస్తారని కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీ రాత్రి గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు చిగురు మేఘం నాటిక, విశాఖపట్టణం తెలుగుకళాసమితి కళాకారులు నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటిక, 6వ తేదీన గుంటూరు జిల్లా తాడేపల్లి అరవిందా ఆర్ట్స్ కళాకారులు విడాకులు కావాలి, కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు జనరల్ బోగీలు, 7వ తేదీన హైదరాబాదు గోవాడ క్రియేషన్స్ కళాకారులు మూల్యం నాటిక, కత్రపాడు ఉషోదయ నికేతన్ కళాకారులు కిడ్నాప్ నాటిక, 9వ తేదీన పొన్నూరు రసఝురి కళాకారులు గురితప్పిన వేట నాటికలను ప్రదర్శిస్తారు. విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు


వాకాడలో విచారణ చేపడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు, సీడీపీవో

కరప, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఐదో తరగతి బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ ఉత్తర్వులు జారీచేశారు. బాలికపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కథనంపై స్పందించిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు త్రిపర్ణ ఆదిలక్ష్మి డీఈవో, ఎంఈవోలకు ఫోన్ చేసి విచారణ చేపట్టి వెంటనే అతన్ని విధుల నుంచి తొలగించాలని సూచించారు. దీంతో ఎంఈవో కొప్పుల బులికృష్ణవేణి, ఎంఈవో-2 పత్తి సత్యనారాయణ వాకాడలోని ఎంపీపీ స్కూల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. వారిచ్చిన ప్రాథమిక నివేదికను అనుసరించి లైంగిక వేధింపులకు పాల్పడిన వీఎస్.రామారావును సస్పెండ్ చేస్తూ డీఈవో ఆదేశాలు జారీచేశారు. అలాగే బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి, ఐసీడీఎస్ కాకినాడ ప్రాజెక్టు సీడీపీవో యాసరపు లక్ష్మి బుధవారం సాయంత్రం వాకాడ ఎంపీపీ పాఠశాలకు వెళ్లి బాధిత బాలికతో బాటు సహచర విద్యార్థినులు, వారి తల్లులను విచారించారు. ఉపాధ్యాయుడు రామారావు చేసిన అకృత్యాలు, వికృత చేష్టలను బాధిత బాలికతో బాటు మరో నలుగురు బాలికలు పూసగుచ్చినట్టు చెప్పారు. బాలికలు, వారి తల్లులు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా రూపొందించిన నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వారు తెలిపారు. ఈ ఘటనపై స్పందించిన ఎమ్మెల్యే పంతం నానాజీ లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులకు అండగా ఉండి పూర్తి న్యాయంజరిగేలా చూస్తామని తెలిపారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌గా ముద్రగడ నాగేంద్రకుమార్



సర్పవరం జంక్షన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా ముద్రగడ నాగేంద్రకుమార్‌ను ప్రభుత్వం నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ కమాండెంట్‌గా ఉన్న ఐపీఎస్ ఎం దీపిక బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఆక్టోపస్ కమాండెంట్‌గా పనిచేస్తున్న నాగేంద్రకుమార్‌ను ఏపీఎస్పీకి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో ఇక్కడ అదనపు కమాండెంట్‌గా పనిచేశారు.

'ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలి'

సామర్లకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పీసా చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన పెంపొందించేందుకు శిక్షణా తరగతులను పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతం చేయాలని విస్తరణ శిక్షణా కేంద్ర ప్రిన్సిపాల్ జే.వేణుగోపాల్ పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల మండలాలకు చెందిన రెండవ బ్యాచ్ పంచాయతీ కార్యదర్శులకు ఈటీసీ ఆవరణలో అందిస్తున్న రెండు రోజుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 5 జిల్లాలకు చెందిన ఆయా పంచాయతీ కార్యదర్శులు సుమారు 67 మంది హాజరయ్యారు. ఫిబ్రవరి 8 వరకూ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ శ్రీదేవి, రమణ, జాయింట్ డైరెక్టర్ రామనాథం, ఫ్యాకల్టీలు తదితరులు ఉన్నారు.


సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

గంజాయి సేవిస్తున్న ఆరుగురి అరెస్టు

600 గ్రాముల గంజాయితో పాటు మోటారుసైకిళ్లు స్వాధీనం

అమలాపురం టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సావరం బైపాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో గంజాయి సేవిస్తున్నారన్న సమాచారాన్ని పట్టణ సీఐ పి.వీరబాబు అందుకున్నారు. వెంటనే పట్టణ ఎస్ఐ టి.తిరుమలరావు ఆధ్వర్యంలో సిబ్బంది సావరం బైపాస్ రోడ్డులో తనిఖీలు నిర్వహించగా ఆరుగురు యువకులు గంజాయి సేవిస్తున్నట్టు గుర్తించారు. అమలాపురం ఇన్‌చార్జి తహశీల్దార్ వాసా ఎస్.దివాకర్ సమక్షంలో ఫ్రెంచి యానానికి చెందిన కనపర్తి వెంకటదుర్గ అలియాస్ దుర్గ, పెద్దిరెడ్డి గోవిందరాజులు, సాపే వంశీ, కర్రి దుర్గాప్రసాద్, అమలాపురం రూరల్ మండలం చిందాడగరువుకు చెందిన బొంతు నవీన్‌కుమార్, నల్లమిల్లికి చెందిన కోటిపల్లి నవీన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 600 గ్రాముల గంజాయి, నాలుగు మోటారుసైకిళ్లు, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసినవారిని అమలాపురం అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. గంజాయి రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వీరబాబు తెలిపారు.

కొండచిలువలు వచ్చాయి!

మల్లేపల్లి జాతీయ రహదారిపై హల్‌చల్

గండేపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారులో బుధవారం రాత్రి కొండ చిలువ హల్‌చల్ చేసింది. జాతీయ రహదారి దాటేందుకు రోడ్డు మధ్యలోకి రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. అటుగా వెళుతున్న వాహనాలు దానిపై నుంచి వెళ్లడంతో చనిపోయింది. దాని పొడవు సుమారు ఆరున్నర అడుగులు ఉంటుందని స్థానికులు తెలిపారు. అయితే గతంలో ఇదేచోట హైవే పక్కన వరి పొలంలో ఏడున్నర అడుగుల కొండ చిలువను స్థానికులు హతమార్చారు.


గండేపల్లి జాతీయ రహదారిపై చనిపోయిన కొండచిలువ

గిడజాంలో..

రౌతులపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గిడజాం గ్రామం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 18 అడుగుల కొండచిలువను గ్రామస్తులు చంపేశారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పిల్లలు కొబ్బరి మొక్కలకు నీళ్లు పోస్తుండగా బాత్ రూమ్ వద్ద కొండచిలువ ఉండ డంతో ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఉపాధ్యాయులు గ్రామస్తులు దృష్టికి తీసుకెళ్లగా కొండచిలువను హతమార్చారు. అయితే పాఠశాల పైనే కొండ ఉండడంతో కొండ చిలువ వచ్చి ఉంటుందని గ్రామస్తులు భావిస్తున్నారు.


గిడజాంలో హతమార్చిన కొండచిలువ

ఆత్మహత్య చేసుకున్న జర్నలిస్ట్ మృతదేహం కాలువలో లభ్యం



సలీం మృతదేహం, ఫైల్ ఫొటో

సామర్లకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న పెదపూడికి చెందిన జర్నలిస్టు షేక్ సలీం(40) మృతదేహం 20 రోజుల అనంతరం సామర్లకోట కాలువలో లాకులు సమీపంలో తూటికాడ డెక్కలలో చిక్కుకుని ఉండడాన్ని బుధవారం సాయంత్రం సామర్లకోట పోలీసులు గుర్తించారు. దుస్తుల ఆధారంగా సలీం మృతదేహంగా పోలీసులు గుర్తించి పెదపూడిలో ఉన్న సలీం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ నెల 9న సాయంత్రం సామర్లకోట రైల్వే గేటు సమీపంలో ఉన్న నూతన వంతెన పైనుంచి కాలువలోకి సలీందూకి ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు గజ ఈతగాళ్లతో చేపట్టినా ఫలితం లేకపోయింది. బుధవారం సలీం మృతదేహన్ని పోలీసులు గుర్తించి గట్టుకు చేర్చారు. సుమారు 20 రోజులు పాటు నీటిఅడుగు భాగంలోనే మృతదేహం ఉండిపోవడంతో గుర్తుపట్టలేని రీతిలో డీకంపోజ్ అయ్యిందని అక్కడే పోస్టుమార్టం పూర్తి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కృష్ణభగవాన్ తెలిపారు.

కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

అనపర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం పొలమూరులో ఈనెల 14వ తేదీన స్కూటీపై వెళుతున్న మహిళను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో ఆమె తీవ్రగాయాలపాలైంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఆమె రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ ఆసు పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదుపై అనపర్తి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రామవరం గ్రామానికి చెందిన కర్రి అలేఖ్య ఈనెల 14న స్కూటీపై రామవరం నుంచి అనపర్తి వెళ్తుండగా పొలమూరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆమె తీవ్ర గాయాలపాలైంది. దవడ, ఎడమ చేతి ఎముకలు విరిగిపోయాయి. స్థానికుల సహకారంతో ఆమెను అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యుల సూచనల మేరకు రాజమహేంద్రవరం తరలించారు. స్కూటీని ఢీకొన్న వాహనం వివరాలు తెలియరాలేదు. అలేఖ్య భర్త పేర్రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిఠాపురంలో పురూలియా చౌ

పిఠాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కళ్లెదుటే సన్నివేశాలు జరుగుతున్నట్లు నృత్యాభియం, కళ్లప్పగించి చూసేలా కదలికలతో పురూలియా చౌ నృత్యప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. కాకినాడ జిల్లా పిఠాపురం పాత బస్టాండు వద్ద గల సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలో పీఠికాపుర కళావేదికపై బుధవారం రాత్రి పశ్చిమబెంగాల్ సంప్రదాయ నృత్యకళారూపకం పురూలియా చౌ నృత్య ప్రదర్శన నిర్వహించారు. పురాణాల నుంచి వచ్చిన సన్నివేశాలను తీసుకుని మహిషాసుర మర్దిని, అభిమన్యు వధలను ప్రదర్శించారు. గౌర్‌కుమార్, విశాల్ చంద్రకుమార్, గణేష్ చంద్రకుమార్, స్వపన్ మహతో, పీలే మాచౌర్, రోహిన్, అక్షయ్, ఠాకూర్ దాస్‌కుమార్, హర్షభర్థన్ కుమార్, రంపాడ కలిండి, లొడ్డో మ్యూరింగ్, రాజారామ్ ఓరస్, అర్జున్ మాచౌర్ తదితర కళాకారులు ప్రదర్శన ఇచ్చారు.


పిఠాపురంలో నిర్వహించిన పురూలియా చౌ నృత్య ప్రదర్శన దృశ్యాలు

సూరీడు.. సూపర్!




కాకినాడలో బుధవారం సూర్యుడు ఉదయిస్తున్న సమయంలో ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిన దృశ్యాలు

ఫొటోగ్రాఫర్, కాకినాడ

రాజమహేంద్రవరం

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



మా సమస్యలివి.. పరిష్కారం చూపండి!

రాజమహేంద్రవరం మూడో వార్డు వెంకటేశ్వరనగర్‌లో జనాభిప్రాయం

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో 'అక్షరం అండగా.. పరిష్కారమే ఎజెండాగా' పేరుతో మంగళవారం రాజమహేంద్రవరం మూడో వార్డు వెంకటేశ్వరనగర్‌లో నిర్వహించిన చర్చా వేదిక విజయవంతంగా జరిగిన విషయం తెలిసిందే. అధిక సంఖ్యలో వచ్చిన వార్డు ప్రజలు ఎన్నో సామాజిక సమస్యలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వారు ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బుధవారం నాటి సంచికలో అనేక అభిప్రాయాలు ప్రచురించగా, చర్చా వేదికలో మరికొందరు వ్యక్తంచేసిన జనాభిప్రాయాలివి...

-(ఆంధ్రజ్యోతి నెట్ వర్క్)

పందుల బెడద

మా ప్రాంతంలో పందుల బెడద ఎక్కువగా ఉంది. శుభ్రం చేయడంలేదు.గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పారిశుధ్య కార్మికులకు చెబితేనే స్పందిస్తున్నారు, లేకపోతే లేదు.విద్యుత్ లైట్లు వెలగడం లేదు. గోదావరి నీరు సక్రమంగా రావడంలేదు.

-సిరంశెట్టి సూర్య, మహాలక్ష్మి గుడి వీధి.

చెత్త తీసే బండి రావడంలేదు

ఆ ఏరియాలో చెత్త అంతా మా ప్రాంతంలో వేస్తున్నారు. చెత్త తీసే బండి రావడంలేదు.పందుల బెడద ఎక్కువగా ఉంది.

-యల్లంకి శివలక్ష్మి, బర్మాకాలనీ, 4వ వీధి

డ్రైనేజీలో చెత్త వేస్తున్నారు

డ్రైనేజీలో చెత్త ఎక్కువగా వేస్తున్నారు. గత ప్రభుత్వంలో వెలుగుబందలో స్థలం ఇచ్చామంటూ హామీ పత్రం ఇచ్చారు. స్థలం ఇప్పటికీ ఇవ్వలేదు. కొన్నేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాను. సొంతిల్లు లేదు.

-యాసారపు శ్రీలక్ష్మి, బర్మాకాలనీ, 2వ వీధి.

నేటికీ స్థలం చూపలేదు

గత ప్రభుత్వం వెలుగుబందలో ఇళ్లు ఇచ్చామంటూ స్థలం హామీ పత్రం ఇచ్చారు. నేటికీ స్థలం చూపలేదు. నా భర్త గోపాల కృష్ణ ఆరోగ్యం బాగోదు. నాకు పించన్ ఇప్పించాలి. కుక్కలు, పందుల బెడద ఎక్కువగా ఉంది. మా పాప దీక్షితకు పెళ్లయింది. కొత్త రేషన్‌కార్డు ఇప్పించాలి.

-మునూరి రాధిక, బర్మాకాలనీ, 1వ వీధి.

నాకు స్థలం చూపించాలి

గత ప్రభుత్వం ఇల్లు వచ్చిందంటూ ఆనం కళాకేంద్రంలో పట్టా ఇచ్చారు. అగ్రవర్ణాలలో కూడా చాలామంది నిరుపేదలు ఉన్నారు. నా కుటుంబం ఐసు బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాకు స్థలం చూపించాలి

-నార్కెడిమిల్లి భ్రమరాంబ, జయశ్రీ గార్డెన్స్.

పూడికలు తీయడంలేదు

డ్రైనేజీలో క్లీనింగ్ చేయడం లేదు. పూడికలు తీయడంలేదు. రోడ్లు శుభ్రం చేయడంలేదు. వీధి లైట్లు వెలగవు. కల్వర్టు నిర్మాణం కోసం తవ్వి వదిలేశారు. లోపలకు, బయటకు ప్రయాణించాలంటే నానా ప్రయాసలు పడాల్సి వస్తోంది. ఐఎంఏ హాలు ఎదురుగా ఉన్న రోడ్డుపై రాళ్లు లేచిపోవడం వల్ల ప్రమాదాలబారిన పడుతున్నాం. కల్వర్టు నిర్మాణం జరిగే ప్రాంతంలో స్పీడు బ్రేకరు వేయాలి. ముఖ్యంగా సచివాలయ సిబ్బంది నుంచి సమాచారం అందడంలేదు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గోదావరి వాటర్ కోసం నిర్మిస్తున్న ట్యాంకు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి.

- శీలపురెడ్డి శ్రీనివాసరెడ్డి, వాటర్ ట్యాంకు వీధి

సొంతిల్లు లేదు

18 ఏళ్ల నుంచి అద్దె ఇంట్లో ఉంటున్నాను. సొంతిల్లు లేదు. ఇల్లు ఇప్పించాలి.

-వేమగిరి లక్ష్మి, బర్మాకాలనీ, 3వ వీధి.

ఇప్పటికీ ఇల్లు ఇవ్వలేదు

రెండేళ్ల కిందట విద్యుత్‌కాలనీలో ఉన్న సమయంలో ఇల్లు వచ్చిందని చెప్పారు. ఇప్పటికీ ఇల్లు ఇవ్వలేదు.

-అకుల లక్ష్మీరత్నప్రభ,బర్మాకాలనీ, 3వ వీధి.

రోడ్డు నిర్మించలేదు

సెంట్రల్ డ్రైనేజీ నిర్మించారు. మా వీధిలో మా రోడ్డు మాత్రమే నిర్మించకుండా వదిలేశారు. రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉంది.

-సయ్యపు రాజు సీతారామరాజు, 3వ వీధి

వీధిలైట్లు వెలగడంలేదు

రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. వీధిలైట్లు ఎప్పుడు వెలుగుతాయో ఎప్పుడు వెలగవో తెలియదు. కుక్కలు, పందులు విచ్చల విడిగా తిరుగుతున్నాయి.

-మేకా సూర్యభాస్కరరావు, జనసేన నాయకుడు.

పెన్షన్ రావడం లేదు

ఒంటరి మహిళ పెన్షన్ రావడం లేదు. రేషన్‌కార్డులో మార్పులు చేర్పుల కోసం చాలాసార్లు తిరిగాను. అయినా అవ్వలేదు. ఒంటరి మహిళ పెన్షన్ ఇప్పించాలి

-పిండిపోల ప్రసన్న, బర్మాకాలనీ, 2వ వీధి.

ఇంటి పట్టా ఇవ్వలేదు

రాజానగరం ప్రాంతంలో ఇల్లు వచ్చిందంటూ ఎలక్షన్ ముందు చెప్పారు. ఇప్పటికీ స్థలం చూపలేదు. పట్టా ఇవ్వలేదు. ఇళ్లు ఇప్పించాలి.

-బోడపాటి సుహాసిని, బర్మాకాలనీ.

కుళాయి నీరు రావడంలేదు

గోదావరి నీటి కుళాయిల నుంచి నీటి సరఫరా సక్రమంగా జరగడంలేదు. డ్రైనేజీ శుభ్రంగా లేదు. పందుల సంచారం ఎక్కువగా ఉంది.

-వాడబోయిన రోహిత్, బర్మాకాలనీ.

ఇంటి స్థలం చూపలేదు

ఇంటి పట్టా ఇచ్చారు. స్థలం చూపలేదు. 25 ఏళ్ల కిందట నా భర్త నన్ను వదిలేసి వెళ్లిపోయాడు. మా అబ్బాయికి వచ్చే అంతంతమాత్రం జీతంతో కుటుంబం అంతా బతుకుతున్నాం.

-సత్తి మణి, మంతెన గార్డెన్స్, 2వ వీధి.

లో ఓల్టేజీ సమస్య

లో ఓల్టేజీ సమస్య మమ్మల్ని వేధిస్తోంది. సింగిల్ ఫేజ్ నుంచి 3 ఫేజ్‌కు మారిస్తేనే కానీ సమస్య తీరదు. గతంలో ఈ విషయాన్ని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు.

-విళ్ల ఈశ్వరరావు, 5వ వీధి

ఇల్లు సగంలో ఆగిపోయింది

వెలుగుబంద నిడిగట్లలో స్థలం వచ్చింది అన్నారు. ఇల్లు కట్టుకోవడానికి నా దగ్గర సొమ్ము లేదు. నా దగ్గరున్న డబ్బులతో ఇల్లు మొదలెట్టాను.సగంలో ఆగిపోయింది.

-బండారు దుర్గ, జయశ్రీ గార్డెన్స్ 3వ వీధి.

ఇంటి స్థలం రాలేదు

పదిహేనేళ్ల నుంచి ఉంటున్నాను. ఇల్లు స్థలం లేదు. పలుమార్లు దరఖాస్తు చేశాను. అయినా ఇంటి స్థలం రాలేదు.

-మసిరపు అరుణ, బర్మాకాలనీ, 3వ వీధి.

రేషన్‌కార్డు లేదు

తొమ్మిదేళ్ల నుంచి అద్దె ఇంట్లో ఉంటున్నాను. ఇల్లు లేదు. ముగ్గురు పిల్లలు ఉన్నారు. రేషన్‌కార్డు లేదు. ఇంటి స్థలం ఇప్పించాలి.

-కాకర పెంటమ్మ, బర్మాకాలనీ.

మా అత్త పెన్షన్ ఆపేశారు

మా అత్త శ్రీహరిలక్ష్మికి గతంలో పెన్షన్ వచ్చేది. రెండేళ్ల నుంచి పెన్షన్ ఆపేశారు. పెన్షన్ పునరుద్ధరించాలి.

-తలసాని శ్రీలక్ష్మి, బర్మాకాలనీ, లక్ష్మీదేవి ఆలయం వీధి

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: గోరంట్ల



బొమ్మూరులో అభివృద్ధి పనులపై సూచనలిస్తున్న గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని బొమ్మూరు, కాతేరు గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. బొమ్మూరులోని నేతాజీనగర్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అభివృద్ధికి స్థానికులు సహకరించాలని తగాదాలు పడకూడదన్నారు. కాళీకృష్ణనగర్ రోడ్డు నుంచి బృందావన కాలనీ వద్ద దిగేందుకు విశాలమైన రోడ్డు నిర్మించేందుకు స్థలాన్ని సర్వే చేసి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. 10, 11 వీధులను కలుపుతూ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాతేరులోని దాసరి శ్రీనివాసనగర్‌లో ముంపుకు గురౌతున్న ప్రాంతాలను పరిశీలించారు. పేపరుమిల్లు పక్కనున్న ప్రధాన మురికి కాలువను విస్తరించేందుకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి అంచనాలు సిద్ధం చేయించాలన్నారు. ప్రభుత్వ పుంతలను కూడా సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలన్నారు. కాలనీలో మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణకు తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కాశీవిశ్వనాథ్, పీఆర్ డీఈ రవి, జేఈ సంపత్, మత్స్యేటి ప్రసాద్, గంగాన హనుమంతరావు, నున్న కృష్ణ, గంగిన నాని, కురుకూరి కిషోర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వసుంధర

కడియం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలందిస్తూ వారికి తగు సూచనలు సలహాలు అందించాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎస్.వసుంధర తెలిపారు. బుధవారం కడియం ఇమ్మానియేలు లెప్రసీకాలనీని ఆమె సందర్శించారు. అక్కడ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఎండీటీ మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. దీనివల్ల అంగవైకల్యం రాకుండా నివారించవచ్చన్నారు. టీబీ రోగులకు ప్రతీ నెలా క్లినికల్ ఫాలో అప్ జరగాలని ఆదేశించారు.

ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఎల్ఐసీ రూరల్ బ్రాంచి, డెల్టా హాస్పిటల్ సౌజన్యంతో స్థానిక ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో బుధవారం వైద్య శిబిర ఏర్పాటు చేశారు. దీనిని ఎల్ఐసీ సౌత్ సెంట్రల్ మేనేజర్ పునీత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 200 మందికి ఉచితంగా బీపి, షుగర్ టెస్టులు చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ సాహూ, సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, రూరల్ బ్రాంచి మేనేజర్ సూర్యనారాయణ, ఏబీఎం అబ్రహాం, , డివిజనల్ స్టాఫ్, రూరల్ బ్రాంచి ఉద్యోగులు, డీవోలు, ఏజెంట్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనబాట

జిల్లా బ్యాంకు ఉద్యోగుల కో ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి లక్ష్మీపతిరావు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో ఖాతాదారులకు ఇబ్బంది కలగకుండా క్లరికల్ నియామకాలు వెంటనే జరపాలని బ్యాంకు ఉద్యోగుల కో ఆర్డినేషన్ కమిటీ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.లక్ష్మీపతిరావు డిమాండ్ చేశారు. బుధవారం రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ యూనియన్ బ్యాంకులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను పటిష్టపరచాలన్నారు. ఖాతాదారులకు సర్వీస్ ఛార్జీలు తగ్గించాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఏపీ, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య 30వ మహాసభ వివరాల గురించి తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి కేవీ స్వాతి మాట్లాడుతూ ఫిబ్రవరి 8, 9 తేదీల్లో నేషనల్ ఉమెన్ కన్వర్షేషన్ అహ్మదాబాద్‌లో జరుగుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిరావు, స్వాతి, ఉమారాణిను బ్యాంకు ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ జిల్లా కమిటీ తరఫున అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మురళీధర్, రమేష్, సోమరాజు, కీర్తన, ప్రకాష్, కామేష్, కిషోర్, రాంబాబు, శివరామకృష్ణ, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో నడుచుకోవాలి

• జేఎన్‌టీయూకే ఉపకులపతి మురళీకృష్ణ

దివాన్‌చెరువు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి విజయంలో వ్యక్తిత్వ వికాసం, కృషి ప్రాముఖ్యత వహిస్తాయని జేఎన్‌టీయుకే ఉప కులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. రాజానగరం మండలం భూపాలపట్నంలో రాజమహేంద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (రైట్) కళాశాలలో బుధవారం విద్యార్థుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు సన్మార్గంలో నడచి, తద్వారా విజయాలు సాధించాలని సూచించారు. రైట్ కళాశాల చైర్మన్ జీ.సాయిరాధాకృష్ణ, కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ అడ్డాల శ్రీహరి, వైస్ చైర్మన్ టీవీఎల్ నరసింహారావు, కోశాధికారి రవికిరణ్, ప్రిన్సిపాల్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ ఎం. శ్రీధర్, విభాగాధిపతులు ఆర్. రాంబాబురెడ్డి, వై.విజయశ్రీ పాల్గొన్నారు.



బహుమతిగా పుస్తకాలను అందజేస్తున్న వీసీ మురళీకృష్ణ

ఈల మింగిన బాబు సురక్షితం

- సరైన వైద్యం అందించిన జీఎస్ఎల్ డాక్టర్ వెంకటేష్

రాజానగరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రావులపాలెంలో నాలుగున్నరేళ్ల బాలుడు ఆటలు ఆడుతున్న క్రమంలో ఈలను మింగేశాడు. దీంతో శ్వాస ఆడక ఇబ్బందిపడుతున్న సదరు చిన్నారిని తండ్రి రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి పీడియాట్రిక్ సర్జన్ డాక్టర్ వెంకటేష్ కొల్లా ఎక్స్‌రే ద్వారా కుడివైపు ఊపిరితిత్తులో ఉన్నట్టు గుర్తించి, పిడియాట్రిక్ బ్రాంకో స్కోపీ ద్వారా బయటికి తీశారు. ప్రస్తుతం బాబుకి ఏ సమస్యా లేదని, ఒకరోజు పరిశీలనలో ఉంచిన అనంతరం ఇంటికి పంపించామని డాక్టర్ చెప్పారు. ఈ ప్రొసీజర్ చాలా సున్నితమైనదని, ఇందులో టీమ్ స్పిరిట్, ఎక్విప్‌మెంట్ పాత్ర విశేషమైనదని ఆయన వివరించారు.



చికిత్స అనంతరం సురక్షితంగా ఉన్న బాలుడు

స్టీల్‌ప్లాంట్ రక్షణ జాతకు సీపీఎం ఘన స్వాగతం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బ్యాంకు ఉద్యోగుల కో ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి లక్ష్మీపతిరావు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు యు.రామస్వామి డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా చేపట్టిన విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ జాతా బుధవారం రాజమహేంద్రవరం చేరుకుంది. ఈ జాతాకు స్థానిక సీపీఎం నాయకులు శ్యామలాసెంటర్‌లో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అధ్యక్షత వహించారు. రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించి చేతులు దులుపుకోవడం సరికాదని, ఇనుపగనులు కేటాయించడంతోపాటు ప్రైవేటీకరణ ప్రయత్నాలను విరమించుకున్నామని స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు జి.శ్రీనివాసరావు, బి.గురప్ప, ఎన్.రామారావు, వై.రాము, జిల్లా కార్యదర్శి అరుణ్ మాట్లాడారు.సీపీఎం రాష్ట్ర నాయకులు మహేష్, సోమేష్, జిల్లా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాజమండ్రిలో రతన్ టాటా విగ్రహం-సర్కిల్‌ను ఏర్పాటు చేస్తాం

టాటా ఏఐఏ కెరీర్ ఆపర్చునిటీస్ సెమినార్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): దేశంలో యువతకు తమ సంస్థ ద్వారా లక్షలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా నాణ్యమైన ఉత్పత్తులను ప్రజలకు అందించేందుకు ఎంతో కృషి చేసిన టాటా గ్రూప్ పూర్వపు చైర్మన్ రతన్ టాటా విగ్రహాన్ని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసి ఆయన పేరున సర్కిల్‌గా నామకరణ చేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రకటించారు. బుధవారం రాత్రి రాజమహేంద్రవరంల హోటల్ షెల్టాన్‌లో జరిగిన టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కెరీర్ ఆపర్చునిటీస్ సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్లస్టర్ హెడ్ రాజీవ్ మాట్లాడుతు టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్‌లో సలహాదారులు, లీడర్లుగా చేరిన వారి జీవనశైలి మారుతుందని చెప్పారు. 2024-25లో 99.13శాతం క్లైమ్‌లు పరిష్కరించినట్టు తెలిపారు. సెమినార్‌లో సీనియర్ బిజినెస్ అసోసియేట్స్ లీడరు శ్రీనివాస్ గొల్లవిల్లి, బ్రాంచ్ మేనేజరు ఎం.గంగాధర్ సీనియర్ పార్టనర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే...

దివాన్‌చెరువు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వార్షిక మరమ్మతుల్లో భాగంగా దివాన్‌చెరువు 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నుంచి సరఫరా అయ్యే అన్ని 11 కేవీ ఫీడర్లకు గురువారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఆపరేషన్) దాట్ల శ్రీధరవర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివాన్‌చెరువు, శ్రీరాంపురం, పాలచర్ల గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. దీన్ని ప్రతిఒక్కరూ గమనించాలని కోరారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా వెంకటరెడ్డి



గోకవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గోకవరానికి చెందిన సత్తి వెంకటరెడ్డి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. గత కొనేళ్లుగా ఆయన పార్టీ పటిష్టతకు ఎనలేని కృషిచేస్తున్నారు. ఆ సేవలను గుర్తించిన పార్టీ పెద్దలు ఈ పదవిని కట్టబెట్టారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీరంపాలెంలో ఉచిత పశువైద్యశిబిరం



రైతులకు మందులు అందిస్తున్న ఎంపీటీసీ శ్రీను, వైద్యాధికారి జాన్‌పాల్

రంగంపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వీరంపాలెంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనిద్వారా 53 పశువులకు వైద్యసేవలు అందించినట్టు వడిశలేరు పశువైద్యాధికారి ఇ.జాన్‌పాల్ తెలిపారు. సర్పంచ్ మత్సా వీరభద్రరావు, ఎంపీటీసీ ఉద్దండ్రావు శ్రీను, ఎన్డీయే కూటమి నాయకులు ఉద్దండ్రావు వినయ్, ఎలుగుబంటి సత్యనారాయణ, 42 మంది రైతులు, జి.దొంతమూరు జూనియర్ పశువైద్యాధికారిణి ఉమాదేవి, పశువైద్య సహాయకులు శివ, దుర్గాప్రసాద్, రాణి, సురేష్, సత్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వడిశలేరులో అధ్యయనోత్సవాలు

రంగంపేట,జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వడిశలేరు గ్రామ ఇలవేల్పు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీభజేనారాయణస్వామి వారి తిరు కల్యాణమహోత్సవాల సందర్భంగా గురువారం నుంచి అధ్యయనోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ముమ్మన రాంబాబురెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మల్లిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం వారిద్దరు మాట్లాడారు. ఉదయం, సాయంత్రం శుక్లయజుర్వేద పారాయణ జరుగుతుందన్నారు. అలాగే వచ్చేనెల 7వ తేదీ నుంచి 12 వరకు తిరుకల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తామని, భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచడానికే పతకాలు

బిక్కవోలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకే తాను పతకాలు అందజేస్తున్నట్టు జి.దొంతమూరుకు చెందిన శ్రీఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాళ్ల శ్రీను తెలిపారు. జడ్పీ హైస్కూల్లో 2023-24లో ఆరు నుంచి 10వ తరగతి చదివి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు, స్పోర్ట్స్, ఫైన్ ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వెండి పతకాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనును హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి,టీచర్లు ఘనంగా సత్కరించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ వైస్ చైర్మన్ రేజెట్టి వీరమణి పాల్గొన్నారు.

ఉపాధి ఏపీవోపై విచారణ

● ఫిర్యాదుదారుడు గైర్హాజరుతో మధ్యలో నిలిపివేత



విచారణ చేస్తున్న అంబుడ్స్‌మెన్ ఖాదర్ బాషా

గోకవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన ఉపాధి ఏపీవో అవినీతికి పాల్పడ్డాడంటూ చేసిన ఫిర్యాదుపై బుధవారం గోకవరం ఎస్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అయితే ఫిర్యాదుదారుడు మధ్యలో బయటకు వెళ్లిపోవడంతో విచారణను మధ్యలో ఆపివేశారు. వివరాల్లోకి వెళ్తే.. ప్రస్తుతం ఏపీవోగా పనిచేస్తున్న అప్పలరాజు తన వద్ద డబ్బులు తీసుకున్నాడంటూ ఇటీవల విధుల నుంచి తొలగించబడిన వెదురు పాక ఫీల్డ్‌అసిస్టెంట్ బుల్లబ్బాయి అభియోగం మోపుతూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో అంబుడ్స్‌మెన్ ఖాదర్‌బాషా బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ అభియోగాలను బుల్లబ్బాయి రుజువు చేయలేకపోవడమే కాకుండా, మధ్యాహ్నం నుంచి విచారణకు గైర్హాజరయ్యాడు. ఇదిలా ఉండగా ఫీల్డ్‌అసిస్టెంట్‌గా బుల్లబ్బాయి పనిచేసిన సమయంలో గ్రామంలో అనేక అవకత వకలకు పాల్పడ్డాడంటూ కొంతమంది గ్రామస్థులు అంబుడ్స్‌మెన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఫిర్యాదుదారుడు బుల్లబ్బాయికి మరికొంత సమయం ఇస్తూ విచారణ వాయిదా వేసినట్టు అంబుడ్స్‌మెన్ ఖాదర్‌బాషా తెలిపారు.

'లక్ష డప్పులు వేల గొంతుకలు'ను విజయవంతం చేయండి

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై స్టాండ్‌ను మార్చుకున్న తెలంగాణ సీఎం రేవంత్ వైఖరిని నిరసిస్తూ హైదరాబాద్‌లో ఈనెల 7న మాదిగ దండోరా నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతుకలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో సీఎం చంద్రబాబు స్పందించి కమిషన్ వేయడం పట్ల ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మెగా డీఎస్సీ, పోలీస్, ఆర్టీసీ తదితర నోటిఫికేషన్లు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ కోస్టల్ రీజియన్ నేత ముమ్మిడివరపు చిన్నసుబ్బారావు, రాష్ట్ర నేత వైరాల అప్పారావు పాల్గొన్నారు.

సమాజంలో చిచ్చుపెట్టే వారికి పద్మశ్రీ ఇవ్వడం దారుణం

పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రికమెండ్ చేసిన వ్యక్తులను కాదని కేంద్ర ప్రభుత్వం.. అమ్ముడిపోయిన, సమాజంలో కులాల మధ్య చిచ్చుపెట్టే వారికి కేటాయించడం బీజేపీ దిగజారుడుతనానికి నిదర్శనమని పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్ ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అంబేడ్కర్ వాదన ప్రకారం ఎస్సీలు అందరూ ఐక్యంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ కోరుకుంటుందన్నారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



కొంకుదురులో పాడి రైతులకు మందులు అందజేస్తున్న దృశ్యం

బిక్కవోలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కొమరిపాలెం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి రైతులకు సూచించారు. కొంకుదురులో బుధవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా 20 దూడలకు పాముల మందును అందజేశారు. మండల పశు వైద్యాధికారులు ప్రణీత్, వీర్రాజు, సర్పంచ్ సత్తి వీరమణి, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: ప్రభుత్వం పశువుల ఆరోగ్య పరిరక్షణకు ఏర్పాటు చేస్తున్న పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కుతుకులూరు సర్పంచ్ గొల్లు హేమతులసి అన్నారు. బుధవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించా రు. ఈ శిబిరంలో 98 పశువులకు వైద్యసేవలు అందించినట్టు అనపర్తి పశువైద్య సహాయ సంచాలకులు వై.శ్రీనివాసరావు తెలిపారు. పశువైద్య శస్త్ర చికిత్స నిపుణుడు టీ.రామచంద్రారెడ్డి, డాక్టర్ ఎం. సమత, సిబ్బంది, కూటమి నాయకులు పులగం తిరుమలరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రాజానగరం: చక్రద్వారబంధంలో బుధవారం పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 1380 పశువులకు వైద్యం అందజేశామని పశువైద్యాధికారి ఎం.అరుణ తెలిపారు. ఇందులో భాగంగా ఎదకు రాని పశువులకు , గర్భకోశ వ్యాధులకు చికిత్స, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపామన్నారు. అనంతరం నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముదునూరి సత్యవాణి, నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు, టీబీ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- జిల్లా కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ వసుంధర



రామవరం పీహెచ్‌సీలో కుష్ఠు, టీబీ సర్వే వివరాలను పరిశీలిస్తున్న డాక్టర్ వసుంధర

అనపర్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కుష్ఠు, టీబీ వ్యాధులపై ప్రభుత్వ వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా టీబీ వ్యాధిగ్రస్థులకు సరైన చికిత్స అందించాలని జిల్లా కుష్ఠు నివారణ అధికారి డాక్టర్ ఎన్. వసుంధర అన్నారు. బుధవారం రామవరం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆమె మాట్లాడుతూ టీబీ పరీక్షల విషయంలో రాజీ పడొద్దని సిబ్బందికి సూచించారు. వైద్యులు సుమతీదేవి, మీనాక్షి, ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, తదితరులున్నారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీడీవో ఎం. రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కమిటీ సభ్యులు సర్పంచ్ గిరిడా గంగాభవాని, చింతా సురేష్‌రెడ్డి, వైద్యులు సుమతీదేవి, మీనాక్షి, సిబ్బంది పాల్గొన్నారు.

'సూపర్‌సిక్స్' అమలులో ప్రభుత్వం విఫలం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు విమర్శలు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించి సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు ఇప్పుడు వాటిని అమలు చేయకుండా ఎందుకు చతికిలపడ్డారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శించారు. బుధవారం ఆయన రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడుతూ 15 శాతం వృద్ధి రేటు దాటిన తర్వాత సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామంటే అది సాధ్యం కాని పని అన్నారు. రాష్ట్రంలో మహిళలు, రైతులు, విద్యార్థులు, వలంటీర్లు ఇలా అందరినీ కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

నేటి నుంచి దివాన్‌చెరువులో కుంభాభిషేక కార్యక్రమాలు

దివాన్‌చెరువు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని డాక్టర్ రాంబాబు గృహ ఆవరణలో శ్రీహేరంబ గణపతి, బాలకుమారస్వామి సహిత విశ్వేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి కుంబాభిషేక కార్యక్రమాలు ప్రారంభం అవుతాయని నిర్వాహకుడు డాక్టర్ కేవీఆర్ సుబ్రహ్మణ్యం (లక్ష్మీరాంబాబు) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడురోజుల పాటూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఏడు వరకు కుంకుమ పూజలు, కల్యాణం, హారతి వంటివి జరుగుతాయన్నారు. అనంతరం సంగీత, సాహిత్య కార్యక్రమాలు, శాంతిమంత్రం ఉంటాయని చెప్పారు. వచ్చేనెల 2వ తేదీన ఆలయ కుంబాభిషేక కార్యక్రమ మహోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు యావన్మంది వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని లక్ష్మీరాంబాబు విజ్ఞప్తి చేశారు.

ఈ ఏడాది ఆరంభంలోనే ఎన్నికల సందడి మొదలైంది. చాలాకాలం నుంచి పట్టభద్రులు ఎదురుచూస్తున్న ఎన్నికల షెడ్యూల్ రానే వచ్చింది. ఇప్పటికే కార్యరంగం సిద్ధం చేసుకుని వివిధ వర్గాలతో అనేకమంది అభ్యర్థులు ఓటర్లతో మమేకం అవుతూ వస్తున్నారు. 2019లో జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థుల గడువు ముగియనుండడంతో తిరిగి ఎన్నిక అనివార్యమైంది. ఈసారి టీడీపీ సహా పెద్ద సంఖ్యలోనే అభ్యర్థులు రంగంలో నిలిచే అవకాశాలు ఉన్నాయి. ఆ మేరకు ఎన్నికల్లోను నువ్వానేనా అనేటట్టుగా అభ్యర్థులు ఢీకొనబోతున్నారు.

ఇక ఎమ్మెల్సీ పోరు!

మోగిన ఎన్నికల నగారా



- ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల
- ఈసారి రంగంలో టీడీపీ అభ్యర్థి
- ఇప్పటికే ప్రచార పర్వంలోకి
- వామపక్షాలతోపాటు బరిలోకి అత్యధికులు
- హోరాహోరీ పోటీ తప్పదా..



పేరాబత్తుల రాజశేఖర్... దిడ్ల వీరరాఘవులు

(కాకినాడ సిటీ/రాజమహేంద్రవరం / ఏలూరు-ఆంధ్రజ్యోతి)

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూలు విడుదలైంది. దీంతో సమాంతరంగా ఎన్నికల 'కోడ్' కూసింది. ఇప్పటికే కూటమి తరపున టీడీపీ సహా మిగతా పక్షాలు తమ అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపేందుకు సన్నాహాల్లో ఉన్నాయి. కూటమి టీడీపీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ను మూడు నెలల కిందటే రంగంలోకి దింపారు. ఓటర్ల నమోదు ప్రక్రియ ఆరంభం నుంచి రాజశేఖర్ తన పని తాను చేసుకుంటూపోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను ఎమ్మెల్సీల్లో ఎన్నికల్లో పార్టీ బలపరుస్తున్న అభ్యర్థి గెలిచేలా చూడాలని ఇప్పటికే టీడీపీ అధినాయకత్వం జిల్లాస్థాయి నాయకత్వాన్ని ఆదేశించింది. తాజాగా పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న రాజశేఖర్ గెలుపు పార్టీకి అత్యవసరమని, ఎక్కడా పొరపాట్లకు, లోటు పాట్లకు తావివ్వద్దని పార్టీ ముఖ్యుల భేటీలో సీఎం చంద్రబాబు సూచనలు జారీ చేశారు. బుధవారం రాజశేఖర్ అమరావతిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిమంత్రి నారా లోకేష్‌తో కూడా సమావేశమయ్యారు. ఇప్పటికే కూటమి ఎమ్మెల్యేలు, ఇతర నేతల మద్దతు ఆయనకు లభించింది. దీంతో పట్టభద్రుల ఓటర్ల నమోదు ఆరంభ దశలోనే ఆయనను ఉభయగోదావరి జిల్లాల్లో పర్యటించేలా పార్టీ ముఖ్యులు చొరవ చూపారు. అన్ని నియోజకవర్గాల్లోను పట్టభద్రుల ఓటర్ల చేరికలో చొరవ తీసుకోవాల్సిందిగా ఉభయగోదావరి జిల్లాల నేతలకు అప్పట్లోనే ఆదేశాలు అందాయి. దీంతో పార్టీ సీనియర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు దగ్గరుండి మరీ రాజశేఖర్‌ను పార్టీ కేడర్‌కు పరిచయం చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆయన వివిధ నియోజకవర్గాల్లో ఓటర్లతో సాన్నిహిత్యం పెంచుకుంటూ వస్తున్నారు. ఇంకోవైపు గడిచిన 2019లో పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా అప్పట్లో వామపక్షాలు బలపరిచిన అభ్యర్థి ఐ.వెంకటేశ్వరరావు గెలుపొందారు. విద్యావేత్త శేషారెడ్డిపై వెంకటేశ్వరరావు విజయం సాధించారు. ఆనాటి ఎన్నికల్లో వీరిద్దరి మధ్య హోరాహోరీగానే పోరు సాగింది. పట్టభద్రుల ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి రకరకాల ప్రయోగాలు చేశారు. వామపక్షాలు బలపరిచిన అభ్యర్థి కాకుండా తమకు మద్దతు ఇస్తే అనూహ్యంగా సరైన స్థితిగతులు కల్పిస్తామంటూ మిగతా వారంతా పెద్దఎత్తున ప్రచారం సాగించారు. అయినప్పటికీ పట్టభద్రుల ఓటర్లు వెంకటేశ్వరరావు వైపే మొగ్గు చూపారు. అప్పట్లో టీడీపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దిగకుండా జాగ్రత్తపడింది. ఈసారి వామపక్షాల మద్దతుతో తూర్పుగోదావరికి చెందిన దిడ్ల వీరరాఘవులు పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. తాము బలపరిచిన అభ్యర్థి గెలుపొందేలా, ఉమ్మడి నిర్ణయం అమలయ్యేలా వ్యూహం సిద్ధం చేసుకుంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా అధికారంలో లేని పక్షానికే ఓటర్ల మొగ్గు ఉంటుందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా తాము బలపరిచిన అభ్యర్థే గెలుపొందుతారన్న ధీమాతో ఉన్నారు. దీనికితోడు పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున అభ్యర్థులు పోటీకి దిగే అవకాశాలు స్పష్టంగా కనపడుతున్నాయి. గతం కంటే భిన్నంగా ఈసారి పట్టభద్రుల్లో చైతన్యం రావడం, ఓటర్ల జాబితాలో సంతృప్తికర స్థాయిలో ఓటర్ల నమోదు జరగడం మరో పరిణామం. సాధ్యమైనంత మేర ఓటర్లను ఆకర్షించడం, గెలుపుకు చేరువకావడం అనే రెండు లక్ష్యాలను సాధించేందుకు తహతహలాడుతున్నారు. ప్రతిపక్ష వైసీపీ నుంచి పోటీ ఉంటుందా లేదా ఎవరికైనా మద్దతుగా నిలుస్తుందా.. స్పష్టత లేదు.

పురుష ఓటర్లదే ఆధిక్యత

గడిచిన మూడు మాసాలుగా ఓటర్ల జాబితాలో చేరికలు భారీగానే సాగాయి. నియోజకవర్గాల వారీగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కూటమి ముఖ్య నేతలు పట్టుపట్టి మరీ ఓటర్ల చేరికను ప్రోత్సహించారు. గడిచిన నెలన్నర కిందట ఉభయగోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఓటర్ల జాబితాలో కేవలం లక్షా 27 వేల మంది నమోదయ్యారు. ఆ తదుపరి నియోజకవర్గాల వారీగా సమీక్ష సాగడంతో ఒక్కసారిగా ఈ సంఖ్య ఎక్కడికక్కడ పెరుగుతూ వచ్చింది. మొత్తం ఓటర్ల సంఖ్య మూడు లక్షల 15 వేల 261గా ఉంది. వీరిలో పురుష ఓటర్ల సంఖ్య లక్షా 83 వేల 734 కాగా, అదే మహిళా ఓటర్ల సంఖ్య వీరికంటే తక్కువగా లక్షా 31 వేల 507గా లెక్క తేలింది. అంటే పట్టభద్రుల నియోజకవర్గంలో పురుష ఓటర్లే గెలుపోటములకు నిర్ణేతలు కాబోతున్నారు. ఒక్క ఏలూరు జిల్లాలోనే 42 వేల 602 మంది ఓటర్లు ఉండగా అదే పశ్చిమగోదావరిలో 69 వేల 884 మంది ఉన్నారు. ఓటర్ల జాబితాలో పట్టభద్రులకు చోటు కల్పించే దిశగా ఏపీ ఎన్జీవోలు ఒకింత చొరవ చూపారు.

- నేటి నుంచి అమలులోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి
- ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల
- 27న పోలింగ్.. మార్చి 3న కౌంటింగ్

కాకినాడ సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నిక నగరా మోగింది. ఏపీలో రెండు పట్టభద్రుల, ఒక ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం షెడ్యూల్ విడుదలైంది. తూర్పు-పశ్చిమ గోదావరి, కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు శ్రీకాకుళం-విజయనగరం-విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. 10వతేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 11న నామినేషన్ల పరిశీలన చేయనున్నారు. 13న నామినేషన్ల ఉపసంహరణ గడువుగా ప్రకటించారు. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ ప్రక్రియ 8వ తేదీలోగా ముగించాల్సి ఉంది. ఎన్నికలు జరగనున్న జిల్లాల్లో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ఇంతవరకు ఉభయగోదావరి జిల్లాల పరిధిలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 3 లక్షల15 వేల 261మంది పట్టభద్రుల ఓటర్ల నమోదు జరిగింది. ఇదిలా ఉండగా, ఈనెల 31వ తేదీ వరకు పట్టభద్రుల ఓటర్ల నమోదుకు గడువు ఉంది.

నామినేటెడ్ పోస్టులన్నీ వాయిదా

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బుధవారం నుంచి కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీతో సహా మార్కెట్ కమిటీల ఎన్నిక ప్రక్రియ వరకు అంతా గప్‌చుప్‌గా అయింది. సంక్రాంతి పండుగ తర్వాత పదవుల పందేరం ఉంటుందని ఎంతో ఆశగా చూస్తున్న వారందరికీ ఈ ఎన్నికల షెడ్యూలు ఆశనిపాతంలా మారింది. ఇక మార్చి వరకు ఎదురుచూపులు తప్పవు.

సీఎం చంద్రబాబు పర్యటన రద్దు

రాజమహేంద్రవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఫిబ్రవరి 1న కొవ్వూరు మండలంలోని దొమ్మేరులో జరగవలసిన సీఎం నారా చంద్రబాబు నాయుడు పర్యటన రద్దు అయింది. పేదల గృహ ప్రవేశాలు ప్రారంభం, పింఛన్ల పంపిణీతోపాటు ఇక్కడ సభ నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎమ్మెల్యేలు ఈ మేరకు సమీక్షలు నిర్వహించారు. బుధవారం కూడా క్షేత్రస్థాయి సీఎం పర్యటనకు అవసరం ఏర్పాట్లన్నీ సుమారుగా సిద్ధం చేశారు. కానీ ఎలక్షన్ కమిషన్ పలు ప్రాంతాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బుధవారం షెడ్యూల్ ప్రకటించి, తక్షణమే కోడ్ అమలులోకి వస్తున్నట్టు ప్రకటించింది. కానీ సీఎం ప్రోగ్రాం ముందుగానే నిర్ణయించింది కావడంతో అనుమతి ఇవ్వవలసిందిగా ఎన్నికల సంఘానికి ప్రభుత్వ యంత్రాంగం లేఖ కూడా రాసింది. కానీ కోడ్ అమలులోకి రావడం వల్ల సీఎం సభ నిర్వహణ వీలుకాదని, అది కోడ్ పరిధిలోకే వస్తుందని ఎన్నికల సంఘం స్పష్టం చేయడంతో ఇక్కడ పర్యటన వాయిదా పడింది. కాగా ఎన్నికలు లేని అన్నమయ్య జిల్లాకు సీఎం సభను మార్చారు.



రాజమహేంద్రవరంలో జరిగిన టీడీపీ నగర విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి

పార్టీ జెండా మోసిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుంది

టీడీపీ నగర విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి29 (ఆంధ్రజ్యోతి): జెండా మోసి పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో బుధవారం జరిగిన నగర టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం కార్యకర్తలు చాలా కష్టపడ్డారని అందరి కష్టం తమకు గుర్తుందన్నారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం రూ.8 లక్షల కోట్లు ప్రజాధనం దోపిడీచేసి ఇంటికి పోయాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమన్వయంగా ముందుకు సాగుతున్నామన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికే నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఇప్పటికే నగరంలో జరిగిన ఆర్యాపురం, జాంపేట బ్యాంక్ ఎన్నికల్లోను, చాంబర్ ఎన్నికల్లోను టీడీపీలో కష్టపడిన వారికే ప్రాధాన్యత కల్పించామన్నారు. కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడు పెట్టిన టీడీపీ విజయం తథ్యమన్నారు. నగరంలో వైసీపీ ఖాళీ అయ్యిందని, తాము డోర్లు ఓపెన్‌చేస్తే ఆ పార్టీ పూర్తిగా ఖాళీ అవుతుందన్నారు. జగన్‌వల్ల అధోగతి పాలైన రాష్ట్రానికి చంద్రబాబు రూపంలో మనకు పెద్ద సంపద ఉందన్నారు. తొలుత మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ల ఆలోచనా విధానంలో రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు అంటేనే ఏపీ బ్రాండ్ ఇమేజ్ అని ప్రపంచవ్యాప్తంగా ఇమేజ్ ఉన్న నేత అని అన్నారు. దావోస్ పర్యటన ప్రభావం భవిష్యత్తులో చూస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే అంటే ఎలా పనిచేయాలో చూపిస్తున్న ఆదిరెడ్డి వాసుకు అభినందనలు తెలిపారు. శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌లు రాష్ట్ర ప్రగతి కోసం ఎలా కష్టపడుతున్నారో రాజమహేంద్రవరం అభివృద్ధికి ఆదిరెడ్డి వాసు అదే స్థాయిలో కష్టపడుతున్నారన్నారు. బ్యాంక్ ఛైర్మన్ చల్లాశంకర్రావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, టీఎన్‌టీయూసీ జిల్లా మాజీ అధ్యక్షుడు నక్కా చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు మజ్జిరాంబాబు, దొండపాటి సత్యంబాబు, వర్రే శ్రీనివాసరావు, కోసూరి చండీప్రియ, తురకల నిర్మల తదితరులు మాట్లాడారు.

పెద్దాసుపత్రిలో రోగుల సందర్శనకు ఆంక్షలు

జీటీజీహెచ్‌లో సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ మాత్రమే అనుమతి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పెద్దాసుపత్రిలో రోగులను పరామర్శించేందుకు వచ్చే సందర్శకులపై ఆసుపత్రి అధికారులు పలు ఆంక్షలు విధించారు. కేవలం సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్యలోనే రోగులను చూసేందుకు సందర్శకులను అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్) పర్యవేక్షణాధికారి పేరుతో ఆయా విభాగాధిపతులకు ఆదేశాలు ఇస్తూ, హెచ్‌వోడీలు అందరూ తమ కింద పనిచేస్తున్న నర్సింగ్ సిబ్బందికి ఈ విషయమై తగిన సూచనలు జారీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపిన విషయాల మేరకు ఈ చర్యలు తీసుకుంటున్నామని, ఈ సూచనలను తు.చ తప్పకుండా అందరూ పాటించాలని స్పష్టంచేశారు. దీంతో ఇన్‌పేషెంట్లుగా ఉన్న తమ వారిని పరామర్శించేందుకు వచ్చే సందర్శకులను. నిర్ణీత వేళల్లో మాత్రమే అనుమతిస్తారు. అలాగే ఆయా వార్డుల్లో వైద్యంకోసం చేరిన రోగులకు చెందిన వ్యక్తులు తప్ప ఇతర వ్యక్తులను అనుమతించరాదని, ఎటువంటి అనుమతిలేని తినుబండారాలను లోపలకు అనుమతించవద్దని సూచించారు. కాగా, గతంలో ఎన్నడూ లేని విధంగా హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపిన సూచనల మేరకు అంటూ, ఆసుపత్రి అధికారులు ఇలాంటి ఆదేశాలు జారీచేయడం వివాదాస్పదంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. రోగులను పరామర్శించడానికి సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్య కేవలం రెండు గంటల సమయం కేటాయించడం, అది కూడా సాయంత్రం 4 తర్వాత మాత్రమే అని కండీషన్ పెట్టడం దూరప్రాంతాల నుంచి వచ్చేవారికి తీవ్ర ఇబ్బందికరంగా, భారంగా మారుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనికితోడు అనుమతిలేని తినుబండారాలను లోపలకు అనుమతించవద్దని సూచించడం గందరగోళానికి దారితీసే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. అనుమతిలేని తినుబండారాలు అంటే ఏమిటనే దానిపై స్పష్టత లేకపోవడమే దీనికి కారణం. ఆసుపత్రిలో ప్రధానమైన సెక్యూరిటీ విభాగాన్ని పటిష్టం చేయకుండా ఇటువంటి అర్థంపర్థం లేని నిర్ణయాలు తీసుకోవడం ఏంటని, దీనివల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతుందని కొందరు మండిపడుతున్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంపై సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌ఆదాలత్‌లో కేసుల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత బుధవారం రాజమహేంద్రవరంలో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో పోలీస్ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అదనపు పబ్లిక్ ప్రాజిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశం నిర్వహించారు. మార్చి 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, ప్రి లిటిగేషన్ కేసులు పరిష్కరించేందుకు చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గోదావరి డెల్టా ఆధునికీకరణకు రూ.19.37 కోట్లు నిధులు మంజూరు : నల్లమిల్లి

అనపర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులకు ప్రభుత్వం రూ.19.37 కోట్లు నిధులు మంజూరు చేసిందని, ఈ నిధులతో గోదావరి డెల్టాలో 122 పనులను చేపట్టనున్నట్టు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన రెండవ అసెంబ్లీ సమావేశాన్ని గోదావరి డెల్టా ఆధునికీకరణపై తాను లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో గోదావరి డెల్టాలో పంట కాలువలు, మురుగునీటి కాలువలను ఆధునికీకరణ చేయనున్నట్టు ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి వ్యవస్థను ఆధునికీకరించి రైతులకు ఊరట కల్పించనున్నామని ఆయన తెలిపారు.

కదిలిన యంత్రాంగం

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. ఆంధ్రజ్యోతి



వెంకటేశ్వరనగర్‌లో చెత్త గుట్టలను తొలగిస్తున్న దృశ్యం

- ఏబీఎన్ ఆంధ్రజ్యోతి చర్చా వేదికలోని సమస్యలపై దృష్టి
- ఇప్పటికే సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దిశానిర్దేశం
- సమస్యలను పరిశీలించిన కార్పొరేషన్ ఎస్ఈ, ఇంజనీరింగ్ అధికారులు
- పారిశుధ్యం, చెత్త డంపింగ్, డ్రైన్ క్లీనింగ్ సమస్యలపై తక్షణం రంగంలోకి
- 9వ డివిజన్‌లో శుభ్రమైన డ్రైన్లు, ఇంటింటి చెత్త సేకరణ వేగవంతం
- వెంకటేశ్వరనగర్ వ్యాలీ పోర్షన్‌లో 5వ నంబర్ రోడ్డు సమస్యపైనా చర్యలు
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'కు స్పందన ఇది



నగరంలోని 9వ డివిజన్ పరిధిలో వివిధ సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేషన్ అధికారులు



సిల్ట్ తొలగింపు పనులు

రాజమహేంద్రవరం/సిటీ జనవరి 28 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించడానికి అధికార యంత్రాంగం నడుంబిగించింది. మాస్టర్‌ప్లాన్ అమలుకాకపోవడంతో రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం కాకపోవడం వల్ల ఇక్కడ ఓ ప్రముఖుని ఇంటి ముందే మురుగునీరు పేరుకుపోయి సమస్యగా మారింది. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి 'అక్షరం అండగా పరిష్కారమే అజెండాగా' పేరుతో మంగళవారం రాజమహేంద్రవరం నగరపాలక పరిధిలోని 9వ డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్‌లో నిర్వహించిన చర్చా వేదికలో ప్రస్తావించిన సమస్యలపై కదలిక వచ్చింది. ప్రధానంగా నగర ప్రముఖుడు ఎ.మాధవర్మ గత పదేళ్లుగా తమ డివిజన్‌లోని వ్యాలీ పోర్షన్ 5వ నెంబరు రహదారి, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కార్పొరేషన్ ఎస్ఈ పాండురంగారావుకు వివరించడంతో ఆ సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించారు. ఈమేరకు బుధవారం ఉదయమే ఎస్ఈ పాండురావు, నగరపాలక సంస్థ సిటీ ప్లానర్ కోటయ్య తమ సిబ్బందితో కలసి వచ్చి ఈ సమస్యను స్వయంగా పరిశీలించారు. పదేళ్లుగా ఉన్న సమస్యను ప్లాన్‌లతో సహా మాధవవర్మ వారికి వివరించారు. దీనిపై ఎస్.ఈ పాండురంగారావు స్పందించి మొదట డ్రైన్ నిర్మాణం చేపడతామని, మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్డు నిర్మించడానికి ఇద్దరికి చెందిన ప్రైవేట్ స్థలాలను సేకరించి, వారికి టీడీఆర్ ఇవ్వవలసి ఉందన్నారు. దీనికి సంబంధించిన మ్యాప్‌లు, ప్లాన్‌లను సీపీ కోటయ్య తీసుకుని మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తామని చెప్పారు.

ఇది పదేళ్ల నాటి సమస్య

వెంకటేశ్వరనగర్‌లో వాకర్స్ పార్కు ఉన్న 5వ నెంబరు రోడ్డు సుమారు కిలోమీటరు ఉంటుంది. కానీ ఈ రోడ్డులో నివసించే ప్రజలకు పెద్ద సమస్య ఉంది. ఈ ప్రాంతం ఏవీ అప్పారావు రోడ్డుకు వెళ్లే వ్యాలీ పోర్షన్ (లోయ ప్రాంతం). దీంతో ఈ ప్రాంతంలో కురిసిన వాన, మురుగుతోపాటు ఎగువ భాగంలో ఉన్న 16 నంబర్ జాతీయ రహదారి ప్రాంతం నుంచి వచ్చే, మురుగు, వాన నీరంతా ఐదో నంబర్ రోడ్డు మీదకు వచ్చి అక్కడే ఉంటున్న ఎ.మాధవర్మ ఇంటి ముందు ముంచేస్తుంటుంది. మరో రిటైర్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఇంటికీ ఇదే సమస్య. వాస్తవానికి గతంలో మున్సిపల్ అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను అమలుచేసి ఉంటే ఈ సమస్య ఉండేది. ఈ రోడ్డు వాలుగా ఉంటుంది. జాతీయ రహదారిలో కురిసిన వాన నీరైనా, ఎగువ భాగంలోని మురుగు నీరైనా ఈ కిందకు రావలసిందే. తూర్పు, దక్షిణ, ఉత్తర భాగాలన్నీ ఎత్తులో ఉంటాయి. మరో మార్గంలోకి పార్కురోడ్డు డ్రైన్‌ను మళ్లించే అవకాశం లేదు. అందువల్ల ఈ రోడ్డులో రోడ్డు నిర్మించలేదు. డ్రెయిన్ కట్టలేదు. వాస్తవానికి మాధవర్మ తన ఇంటిని నిర్మించుకునే ముందు రోడ్డు, డ్రైన్ నిర్మాణం కోసం తన సొంత స్థలం కొంత కార్పొరేషన్‌కు ఇచ్చి ఎల్ఆర్ఎస్ చేయించారు. ఆయన ఇంటి వెనుక ఉన్న మరో యజమాని కూడా మున్సిపాల్టీకి స్థలం రాసిచ్చారు. కానీ అధికారులు మాస్టర్ ప్లాన్‌ను అమలుచేయకపోవడం వల్ల ఆ వీధికి సమస్యగా మారింది.

డ్రైన్ సమస్య పరిష్కరిస్తాం : ఎస్ఈ

వెంకటేశ్వరనగర్‌లోని 5వ నంబర్ రోడ్డులో ముందుగా డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తామని నగరపాలక సంస్థ, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ పాండురంగారావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బుధవారం ఉదయం ఆయన సీపీ కోటయ్యతో కలసి ఈ ప్రాంతంలో పర్యటించారు. సమస్యను వెలుగులోకి తెచ్చిన మాధవవర్మ, రిటైర్డ్ ఇంజనీర్లు, ప్రభాకర్, సత్యనారాయణ అధికారులకు వివరించారు. ఇప్పటికే మున్సిపాల్టీకి స్థలం రాసివ్వడం వల్ల డ్రైన్ నిర్మాణానికి ఇబ్బందిలేదని త్వరగా ఈ డ్రైన్ నిర్మించి కింది రోడ్డులో నిర్మించిన స్టార్మ్ వాటర్ డ్రైన్‌లో కలుపుతామని చెప్పారు. రోడ్డు నిర్మాణం మాస్టర్ ప్లాన్ ప్రకారమే జరగవలసి ఉందని, ఇద్దరు యజమానులకు చెందిన ప్రైవేట్ స్థలంలో కొంతస్థలం తీసుకోవలసి ఉందని, వారికి టీడీఆర్‌లు ఇచ్చే యోచన చేసి, ఇక్కడ మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తామని సీపీ కోటయ్య, ఎస్ఈ పాండురంగారావు తెలిపారు.

9వ డివిజన్‌లో... 12 గంటల్లో...

అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా పేరుతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి మంగళవారం నిర్వహించిన చర్చా వేదికలో ప్రస్తావించిన సమస్యలపై అధికార యంత్రాంగం చర్యలకు దిగింది. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ డివిజన్ సమస్యలపై స్పందించి భరోసా ఇచ్చినవిధంగానే అధికారులు 12గంటలు తిరగకుండా యాక్షన్‌లోకి వెళ్లారు. బుధవారం ఉదయం 8 గంటలకే నగరపాలక సంస్థ ఎస్ఈ ఐ.పాండురంగారావు, ఈఈ, డీఈలతో వెంకటేశ్వనగర్‌లో పర్యటించారు. ఈ బృందంతోపాటు నగర ప్రముఖులు ఎ.మాధవవర్మ, పార్కు అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ, రిటైర్డ్ ప్రభుత్వాధికారి ఎ.వెంకటేశ్వరరావులు ఆ డివిజన్‌లో రహదారులు, పార్కులోని సమస్యలు, డ్రైన్‌లను చూపించారు. వాకర్స్ పార్కు సొసైటీ నిర్వహణలో ఉంది. అందులో ఉన్న చిన్నచిన్న సమస్యలపై కూడా చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇక బర్మాకాలనీ, విద్యుత్ కాలనీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, డ్రైనేజీలో సిల్ట్ తొలగింపు, ఇంటింటి చెత్త సేకరణ చేపట్టారు. ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న ఆదేశాలతో ఎస్ఎస్ రామలింగారెడ్డి పర్యవేక్షణలో ఆయా పనులు జరుగుతున్నాయి. చర్చా వేదికలో ప్రస్తావించిన అంశాలపై పరిశీలనకు వచ్చిన అధికారులతోపాటు మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

జగన్ నిర్వాకంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాళ

ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



కొవ్వూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్‌రెడ్డి రూ.8 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని, దీంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దివాళ తీసిందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భూ కేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ అనుమతులు, ఇలా ప్రతి దాంట్లో ఆశ్రిత పక్షపాతానికి ఒడిగట్టి లక్షల కోట్లు సంపాదించారన్నారు. రాష్ట్రానికి గుండెకాయ లాంటి సచివాలయాన్ని కూడా తాకట్టు పెట్టేశారని విమర్శించారు. టీడీఆర్ బాండ్లు, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్లు, రేషన్ బియ్యంలో చేతివాటం చూపించారన్నారు. చివరికి చిన్నారుల పోషణకు పెట్టే చిక్కీలు, కోడిగుడ్లు వంటి వాటిల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడన్నారు. వైసీపీ ప్రభుత్వం తెచ్చిన అప్పులు ప్రభుత్వ ఆదాయం పెంచే సాగునీటి ప్రాజెక్టులు, అమరావతి నిర్మాణం లాంటి వాటిపై కాకుండా విలాసాలు, జల్సాలకు ఖర్చు చేసి తినేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 7 నెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రీయంబర్స్‌మెంటు వంటి జగన్ ప్రభుత్వ బకాయిలు రూ.22 వేల కోట్లు చంద్రబాబు ప్రభుత్వం చెల్లించిందన్నారు. అప్పులు కూడా పుట్టని పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే ముప్పిడి అన్నారు.

7న 'వేల గొంతులు లక్ష డప్పులు'

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు



పైడిమెట్టలో బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాగరాజు

తాళ్లపూడి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వేల గొంతులు లక్ష డప్పులు కార్యక్రమానికి పైడిమెట్ట గ్రామం నుంచి అధిక సంఖ్యలో మాదిగలు హాజరు కావాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండలంలోని పైడిమెట్ట గ్రామానికి విచ్చేసి ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం గ్రామంలోని బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగరాజు మాట్లాడుతూ 30 సంవత్సరాల దండోరా ఉద్యమంలో పైడిమెట్టకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అనంతరం ఆయనను మాజీ ఎంపీపీ కొప్పాక కోట్నీస్, గెద్దం గణేష్, కొల్లి చినబాబు, జొన్నకూటి పాపారావు, జొన్నకూటి ప్రమోద్ నాగరాజును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గెద్దం వినోద్, ముప్పిడి దానియేలు, సిహెచ్ దొరబాబు, బాబు, ముప్పిడి రవి తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా డ్రైనేజీ నిర్మాణ పనులు



గోపాలపురంలో నిర్మిస్తున్న డ్రైనేజీ

గోపాలపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గోపాలపురంలోని పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న రెండు, మూడు వార్డుల్లో అంతర్గత రహదారుల అభివృద్ధిలో భాగంగా నిర్మిస్తున్న రోడ్డు కం డ్రైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు 62మీటర్ల పొడవు రూ.10 లక్షల ఉపాధిహామీ నిధులతో ఈ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఏటా వర్షాకాలంలో గోపాలపురానికి ఎగువ ప్రాంతంలో ఉన్న వాడాలకుంట పెద్దచెరువు, కోమటిగుంట చెరువు వరదనీటితో నిండి అక్కడ నుంచి ప్రవాహం ఉధృతంగా ప్రవహించడంతో దిగువ ప్రాంతానికి నీరు ప్రవహించకపోవడంతో ఉప్పరగూడెం, గొల్లగూడెం, 2, 3 వార్డులు పూర్తిగా జలమయమవుతున్నాయి. వరదనీరు నిర్వహణ కోసం ఈ రోడ్డు కం డ్రైన్ పనులకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు నిధులు మంజూరు చేయడంతో శాశ్వత ప్రతిపాదికన చేపట్టిన నిర్మాణ పనులు ముగింపు దశకు వచ్చాయి.

వాసవీక్లబ్ కొవ్వూరు అధ్యక్షుడిగా వీరభద్రగుప్తా



ప్రమాణ స్వీకారం చేస్తున్న వాసవీక్లబ్ నూతన కార్యవర్గం

కొవ్వూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు వాసవీక్లబ్ అధ్యక్షుడిగా మన్యం వీరభద్రగుప్తా ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవీక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం కల్చరల్ అధ్యక్షుడు దేవతు కృష్ణప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. అధ్యక్షుడిగా వీరభద్ర గుప్తా, కార్యదర్శిగా సత్యవరపు గురునాథ్ కోశాధికారిగా సత్యవరపు భరత్‌కుమార్, కార్యవర్గ సభ్యులతో వాసవిక్లబ్ వి 202ఏ జిల్లా గవర్నర్ ఎన్‌వీఎస్ఎస్ ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో దర్శి శ్రీనివాసగుప్త, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే ప్రసాద్, కొల్లేపర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైట్‌ఫీల్డ్ సంస్థకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ చినరాములు, ఆర్డీవో సుస్మిత, ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం గ్రామంలో వైట్‌ఫీల్డ్ సంస్థకు గతంలో కేటాయించిన 230 ఎకరాల స్థలాన్ని బుధవారం జాయింట్ కలెక్టరు చిన రాములు సందర్శించారు. బయ్యవరం గ్రామంలోని సర్వే నెంబరు 32లో ఉన్న 270 ఎకరాలకు గానూ 230 ఎకరాల భూమిని గతంలో వైట్‌ఫీల్డ్ పేపరు మిల్లుకు కేటాయించారు. ప్రస్తుతం ఈ భూమి కోర్టులో ఉంది. గతంలో పలు మార్లు అధికారులు ఈ భూములను పరిశీలించగా తాజాగా మరోసారి జేసీ ఆ భూములను పరిశీలించారు. అక్కడ మరో పరిశ్రమ ఏర్పాటు జరుగుతున్నట్టుగా సమాచారం. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, డీటీ మోహన భారతి, వీఆర్‌వోలు నాగేశ్వరరావు, లీలావతి పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు పర్యాటక శాఖాధికారుల పూజలు



కోటసత్తెమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న పర్యాటక శాఖాధికారులు

నిడదవోలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మను రాష్ట్ర పర్యాటక శాఖ ఇంజనీరింగ్ అధికారులు బుధవారం సందర్శించారు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాలతో ఆలయాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దే పనిలో భాగంగా అధికారులు సందర్శించినట్టు దేవస్థానం తెలిపింది.

ముగిసిన గణతంత్ర వారోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

తాళ్లపూడి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణతంత్ర వారోత్సవాల ముగింపు కార్యక్రమం బీజేపీ మండలాధ్యక్షుడు ఇండుగుల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. దీనికి బీజేపీ జిల్లా నాయకుడు గుర్రాల వెంకట్రావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రతి భారతీయుడు స్వతంత్ర సముపార్జనకు, రాజ్యాంగ రచనకు కృషి చేసిన మహానుభావులను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముప్పిడి పరామర్శ

తాళ్లపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగేశ్వరపురంలోని టీడీపీ సీనియర్ నాయకుడు వెంపా నాగేశ్వరరావు సతీమణి వెంకటలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం నాగేశ్వరరావును పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, నాదేళ్ల శ్రీరాం, సూరపని చిన్ని తదితర నాయకులు పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దేవరపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గౌరీపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిడదవోలు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- మునిసిపల్ చైర్మన్ ఆదినారాయణ
- పట్టణంలో దోమల బెడద
- వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి: వైసీపీ కౌన్సిలర్లు
- కౌన్సిల్ సాధారణ సమావేశం



నిడదవోలు మునిసిపల్ కౌన్సిల్ సమావేశ దృశ్యం

నిడదవోలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో వాటి నిధులతో పట్టణాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. నిడదవోలులోని మునిసిపల్ కార్యాలయంలో బుధవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణ అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన చేస్తున్నామన్నారు. అనంతరం వైసీపీ కౌన్సిలర్లు పువ్వల రతీదేవి తదితరులు మాట్లాడుతూ పట్టణంలో దోమల బెడద ఎక్కువైందని, అలాగే ఏ వీధిలో చూసినా కుక్కలు పెరిగిపోయాయని, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వీధి కుక్కలు విచ్చలవిడిగా పెరిగిపోవడంతో చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లడానికి ఆందోళన చెందుతున్నారన్నారు. ఆదినారాయణ సమాధానమిస్తూ ప్రజల ఆరోగ్యంపై అధికార్లు దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు ఎండీ షాకీరాబేగం, కారింకి నాగేశ్వరరావు, కమిషనర్ తోట కృష్ణవేణి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రిడ్జ్ కోర్సుకు ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లమో కోర్సులో నేరుగా రెండో సంవత్సరంలో చేరేందుకు ఎస్‌బీటీఈటీ నిర్వహించే ప్రవేశ పరీక్ష అర్హత కోసం రాజయహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐలో బ్రిడ్జ్ కోర్సు నిర్వహించనున్నట్టు ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎల్ఆర్ కృష్ణన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సులో అభ్యర్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ సంబంధిత ల్యాబ్ ప్రాక్టికల్స్‌లో ఈనెల 22 నుంచి ఫిబ్రవరి 21వరకు రాజమహేంద్రవరం ఐటీఐ లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. తదుపరి బ్రిడ్జ్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 25, 26 తేదీల్లో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్సు కాపీలతో పాటు ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో కార్యాలయంలో సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ కృష్ణన్ తెలిపారు.

కాపవరంలో కలెక్టర్ ప్రశాంతి పర్యటన



కాపవరంలో హెలిప్యాడ్ ఏర్పాటుపై చర్చిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు/తాళ్లపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనను అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ పి.ప్రశాంతి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1న సీఎం చంద్రబాబు కొవ్వూరు నియోజకవర్గంలో గృహ ప్రవేశం, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, రచ్చబండ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. ఈ పర్యటన ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలన్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ డి.నరసింహకిషోర్, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవో రాణి సుస్మిత, హౌసింగ్ పీడీ డి.భాస్కరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, ట్రాన్స్‌కో ఎస్ఈ తిలక్, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు తాళ్లపూడి మండలం మలకపల్లిలో గృహ ప్రవేశాలు, పింఛన్లు పంపిణీ ప్రాంతాలు, కొవ్వూరు మండలం కాపవరంలో మార్కెట్ యార్డు వద్ద హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కొవ్వూరు నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు పర్యటన రద్దయినట్టు కలెక్టర్ తెలిపారు.

యర్నగూడెంలో కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం



రవీంద్రకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

దేవరపల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్నగూడెం గ్రామానికి చెందిన బిరుదుగడ్డ రవీంద్ర కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడడంతోపాటు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో సర్పంచ్ బొంతా భరత్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ నరహరశెట్టి రాజేంద్రబాబు, వైసీపీ నాయకులు నరహరశెట్టి సుధాకర్, వార్డు సభ్యుడు గాడి పెద్దిరాజు, స్థానికులు జువ్వల ఆనంద్, గుదే రాజు, వీర్రాజు, కర్రి శివారెడ్డి, గుమ్మడి శ్రీను పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వసుంధర

కడియం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలందిస్తూ వారికి తగు సూచనలు సలహాలు అందించాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎస్.వసుంధర తెలిపారు. బుధవారం కడియం ఇమ్మానియేలు లెప్రసీకాలనీని ఆమె సందర్శించారు. అక్కడ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఎండీటీ మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. దీనివల్ల అంగవైకల్యం రాకుండా నివారించ వచ్చన్నారు. టీబీ రోగులకు ప్రతీ నెలా క్లినికల్ ఫాలో అప్ జరగాలని ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనబాట

జిల్లా బ్యాంకు ఉద్యోగుల కో ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి లక్ష్మీపతిరావు



బ్యాంకు ఉద్యోగుల సమావేశ దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగంలో ఖాతాదారులకు ఇబ్బంది కలుగకుండా క్లరికల్ నియామకాలు వెంటనే జరపాలని బ్యాంకు ఉద్యోగుల కో ఆర్డినేషన్ కమిటీ జిల్లా కార్యదర్శి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.లక్ష్మీపతిరావు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ యూనియన్ బ్యాంకులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను పటిష్టపరచాలన్నారు. ఖాతాదారులకు సేవ్స్ ఛార్జీలు తగ్గించాలని, బ్యాంకులను ప్రైవేట్‌పరం కాకుండా ఆపాలని, ఐదు రోజుల పనిదినాలు అమలు పర్చాలని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య 30వ మహాసభ వివరాలను ఆయన తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి కేవీ స్వాతి మాట్లాడుతూ ఫిబ్రవరి 8, 9 తేదీల్లో నేషనల్ ఉమెన్ కన్వర్షేషన్ అహ్మదాబాద్‌లో జరుగుతుందని వెల్లడించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిరావు, స్వాతి, ఉమారాణిలను బ్యాంకు ఎంప్లాయీస్ కో ఆర్డినేషన్ జిల్లా కమిటీ తరపున అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మురళీధర్, రమేష్, సోమరాజు, కీర్తన, ప్రకాష్, కామేష్, కిషోర్, రాంబాబు, శివరామకృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వాకింగ్‌కు వెళ్లి.. శవమై కనిపించి..!

పందలపాకలో వివాహిత అనుమానాస్పద మృతి



లలితేశ్వరి మృతదేహం

బిక్కవోలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాకలో ఓ వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. కురుపూడి లలితేశ్వరి (33) స్థానిక సంచుల గొడౌన్లో గుమస్తాగా పనిచేస్తోంది. రోజువారీ దినచర్యలో భాగంగా బుధవారం తెల్లవారుజామున వాకింగ్‌కు బయటకు వెళ్లింది. అయితే ఎంతసేపైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త రాజు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో బంధువులకు సమాచారమిచ్చాడు. వారంతా వచ్చి వెతకగా ఆమె పనిచేస్తున్న సంచుల గొడౌన్లో శవమై కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా ముఖంపై గాయాలు, రక్తపు మరకలు ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు బిక్కవోలు ఎస్ఐ వీ.రవిచంద్రకుమార్ తెలిపారు. క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించింది. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించ గా, అవి సంఘటనా స్థలం నుంచి గ్రామంలోని జెండా పంజా సెంటర్ వరకు వచ్చి ఆగిపోయాయి. ఈస్ట్‌జోన్ డీఎస్పీ బీ.విద్య, అనపర్తి సీఐ సుమంత్ వచ్చి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జనసేన ఆర్థిక సాయం అందజేత



సాయం అందజేస్తున్న జనసేన నాయకులు సువర్ణరాజు తదితరులు

నల్లజర్ల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన పల్లగాని నాగేంద్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతడి వైద్య ఖర్చుల నిమిత్తం జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు జీ.వరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రూ.18 వేలు నగదును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు చోడసాని బాపిరాజు, శివకృష్ణ, కిషోర్, కొత్తపల్లి హరిబాబు, ఉన్నమట్ల సత్య, పల్లపరాజు, వంశీ కృష్ణ, గణపతి పాల్గొన్నారు.

పోతవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

నల్లజర్ల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరం దుర్గా హాస్పిటల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్, పార్డ్ ఇండియా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి వైద్యులు ప్రజకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముందుగా శిబిరాన్ని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ దిడ్ల యాంజిలో ప్రారంభించారు. 102 మందికి పరీక్షలు చేయగా 12మందిని ఆపరేషన్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో క్యాంపు అర్గనేజర్ అంబటి శ్రీనివాసరావు, ఎండీ షరీఫ్, పాపా నాగు, డాక్టర్ బద్రి వీరశేఖర్,వెంకటరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరణ చేయాలి

రాష్ట్రపతికి అంగన్‌వాడీ సిబ్బంది లేఖలు



నల్లజర్లలో రాష్ట్రపతికి రాసిన లేఖలు చూపుతున్న అంగన్‌వాడీలు

నల్లజర్ల, జనవరి29(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలను గ్రేడ్-3, ఆయాలను గ్రేడ్-4 ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ భారత రాష్ట్రపతికి అంగన్‌వాడీ సిబ్బంది లేఖలు రాసారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలు శివకుమారి బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో ఐసీడీఎస్ ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తియిందన్నారు. ఈ వ్యవస్థను క్రమబద్ధీకరించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ద్రౌపతిముర్ముకు లేఖలు రాసినట్లు చెప్పారు. నల్లజర్ల, దూబచర్ల, అనంతపల్లి సెక్టార్ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: గోరంట్ల



బొమ్మూరులో అభివృద్ధి పనులపై సూచనలిస్తున్న గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని బొమ్మూరు, కాతేరు గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. బొమ్మూరులోని నేతాజీనగర్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. అభివృద్ధికి స్థానికులు సహకరించాలని తగాదాలు పడ కూడదన్నారు. కాశీకృష్ణనగర్ రోడ్డు నుంచి బృందావన కాలనీ వద్ద దిగేందుకు విశాలమైన రోడ్డు నిర్మించేందుకు స్థలాన్ని సర్వే చేసి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. 10, 11 వీధులను కలుపుతూ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాతేరులోని దాసరి శ్రీనివాసనగర్‌లో ముంపుకు గురౌతున్న ప్రాంతాలను పరిశీలించారు. పేపరుమిల్లు పక్కనున్న ప్రధాన మురికి కాలువను విస్తరించేందుకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి అంచనాలు సిద్ధం చేయించాలన్నారు. ప్రభుత్వ పుంతలను కూడా సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలన్నారు.కాలనీలో మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణకు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి కాశీవిశ్వనాథ్, పీఈఆర్ డీఈ రవి, జేఈ సంపత్, మత్స్యేటి ప్రసాద్, గంగాన హనుమంతరావు, నున్న కృష్ణ, గంగిన నాని, కురుకూరి కిషోర్ పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని ఇద్దరికి గాయాలు

కొవ్వూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యాన్ ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు మండలం వేములూరు దొరయ్యచెరువుకు చెందిన కొండ్రు ఆదినారాయణ, అతడి స్నేహితుడితో కలిసి ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం బైక్‌పై వెళ్తుండగా సంపంగి బార్ వద్ద వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ బైక్ నుంచి కిందపడడంతో గాయాలయ్యాయి. వారిని కొవ్వూరు ప్రభుతాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యం

కొవ్వూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసునమోదు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరుకు చెందిన 17 ఏళ్ల బాలిక రాజమహేంద్రవరంలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతోంది. ఈ నెల 28వ తేదీ రాత్రి నుంచి కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసునమోదు చేసినట్టు చెప్పారు.

నేడు సత్యదేవుడి హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కిస్తామని ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. విధులు కేటాయించిన సిబ్బంది హాజరు కావాలన్నారు.